Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

జిమ్మిక్కైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జిమ్మిక్కైతు

సంపుటి: 82 • సంచిక: 12 • 25-3-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

D.R. UTTHAMA HOTEL
D.R. UTTHAMA
Brings the world cup to Nellore.
ON A WIDE SCREEN
An "Uniterrupted" live show in a specially designed theatre. All Indian and other major league matches. Experience the excitement
MAY INDIA WINS THE WORLD CUP
Enjoy cricket - In a different way!
Ph: 0861-2317777

పురిటిలోనే పరుగు నేర్చిన జగన్ పార్టీ!

శాసన మండలి స్థానిక సంస్థల నియోజకవర్గాల నుంచి ఒకటికి మూడు స్థానాలు గెలుచుకోవడం ద్వారా వైఎస్.జగన్ తన కొత్త పార్టీకి ప్రాణ ప్రతిష్ట చేశాడు. నిజానికి ఆయన పార్టీ ఇంకా పురిటి దశలోనే వుంది. లాంచన ప్రాయంగా జెండా ఆవిష్కరించడం తప్ప పార్టీ ఆవిర్భావ సభ కూడా జరపలేదు. ఏ జిల్లాలో కూడా పార్టీ కమిటీలు ఏర్పడలేదు. నాయకత్వం నిర్ణయం కాలేదు. కార్యకర్తల సమీకరణ జరగలేదు. మరొక రైతే ఈ పురిటి దశలో ఎన్నికలలో పోటీచేసే సాహసం చేయరు. కానీ జగన్ ఆ అలివిమాలిన పని తలకెత్తుకొని, విజయం సాధించాడు.

రాష్ట్రం మొత్తం మీద ఎనిమిది జిల్లాలలో తొమ్మిది శాసనమండలి స్థానాలకు ఎన్నిక జరిగితే అందులో ఐదు చోట్ల తన అభ్యర్థులను నిలిపాడు జగన్. నామినేషన్లు వేసే నాటికి పార్టీకి అధికారిక గుర్తింపు రాలేదు కాబట్టి, తన అభ్యర్థులందరినీ స్వతంత్రులుగా రంగంలో దింపాడు. ఈ ఐదింటిలో మూడు చోట్ల గెలుపు బహుమానం లభించింది. కడప, చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాలలో ఆ ఘనత సాధించాడు. జగన్ దూకుడుకు కళ్లెం వేయడానికి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేయని ప్రయత్నం లేదు. చంద్రబాబుతో తనకు వ్యక్తిగతంగా వున్న విభేధాలను, తెలుగుదేశం పార్టీతో వున్న వైరుధ్యాలను పక్కనపెట్టి, వారితో చేతులు కలిపాడు. వీలున్న చోటల్లా తెలుగుదేశంతో లాలూచీ కుస్తీ జరిపాడు. రాష్ట్ర రాజకీయాలలో జగన్ ప్రభావం కాంగ్రెస్ నేతలను ఎంతగా కలవర పరుస్తున్నదీ అర్థం చేసుకోవడానికి ఇదొక్కటే చాలు. అయితే అంత ప్రయత్నం చేసినా జగన్‌ను అడ్డుకోలేక పోవడం విశేషం.

పోటీ చేసిన ఐదింటిలో, ప్రధాన రాజకీయ పార్టీలను అధిగమించి, మూడు స్థానాలను గెలుచుకోవడం అంటే, పురుటిలోనే పరుగులు నేర్చినంత గొప్ప విషయమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రజలలో రోజురోజుకూ జగన్ పలుకుబడి క్షీణిస్తున్నదని, వరసబెట్టి వెలికి వస్తున్న జగన్ అక్రమ వ్యాపారాలు, కుంభకోణాల వల్ల ఆయనంటే జనంలో విరక్తి కల్గుతున్నదని జరుగుతున్న ప్రచారాల మధ్య ఈ విజయపరంపర జగన్‌కు కొత్త వూపిరి ఇస్తుందనడంలో సందేహం ఏదీ లేదు.

కిరణ్ పరువు గోవిందా

ఈ ఎన్నికలతో జగన్ ప్రతిష్ట ఆకాశానికి ఎగసి పడితే, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పరువు గోవిందా కొట్టింది. తన స్వంత జిల్లా అయిన చిత్తూరులో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోలేక పోవడం ఆయనకు కోలుకోలేని ఎదురు దెబ్బ క్రిందే లెక్క. ముఖ్యమంత్రి అంటే మొత్తం శాసనసభకు నాయకుడు. కానీ తన జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన దారికి తెచ్చుకోవడం ఆయన తరం కావడం లేదు. ఆ జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కిరణ్ మీద రాజకీయ సమరం సాగిస్తున్నాడు. రామచంద్రారెడ్డి పలుకుబడి, ధనబలం, ప్రజాదరణ కల్గిన నాయకుడు. అగ్రవర్ణాల ప్రతినిధి. ఆయన్ను లొంగదీసుకోవడం కష్టమైన పని అయితే, అర్థం చేసుకోవచ్చు. కానీ రాజకీయంగా ఎటువంటి శక్తియక్తులు లేని ఎస్సీ వర్గానికి చెందిన కుతూహలమ్మ, రవి, మైనార్టీలకు చెందిన షాజహాన్ వంటి శాసన సభ్యులను సైతం కిరణ్ మచ్చిక చేసుకోలేక పోతున్నాడు. ఈ ఎన్నికలో వారంతా రామచంద్రారెడ్డితో చేతులు కలిపి తనను ఓడించడానికి కృషి చేస్తుంటే, నివారించలేకపోయాడు కిరణ్‌కుమార్‌రెడ్డి. దానితో స్వంత జిల్లాలో ఓటమి పరాభవం తప్పలేదు.

స్వంత జిల్లాలోనే పార్టీని అదుపు చేయలేని వ్యక్తి రాష్ట్రాన్ని ఎట్లా నియంత్రిస్తాడన్న ప్రశ్న ఎమ్మెల్యేలలో కల్గుతున్నది. దానితో ముఖ్యమంత్రిని వారు చాలా చులకనగా చూస్తున్నారు. ఇప్పటికే ఆయనంటే ఎవరికీ గౌరవం లేదు. ఈ ఎన్నికలతో మరింత అలుసై పోయాడు. అటు అధిష్టానం కూడా కిరణ్ పట్ల తీవ్ర అసంతృప్తితో వుందని వినికిడి. ఇప్పట్లో ముఖ్యమంత్రి మార్పు అనేది జరగని పని కాబట్టి, ఆయన పదవికి డోకా లేదు. కానీ ఆ పదవితో పాటు దక్కవలసిన గౌరవ మర్యాదలు మాత్రం ఆయనకు మిగలడం లేదు. దురదృష్టవంతుడు పాపం.


జగన్‌ను అరెస్ట్ చేస్తారా?

ఆర్థిక నేరాల క్రింద వైఎస్.జగన్‌ను అరెస్టు చేస్తారా? శాసనసభ లాబీలలో ఈ ప్రశ్న అందరి నోళ్లలో విన్పిస్తున్నది. జగన్ రాజకీయ దూకుడు నిలువరించాలంటే, ఆయన ఆర్థిక నేరాలన్నిటి మీద కఠిన చర్యలు తీసుకోవాలన్న వాదన కాంగ్రెస్‌లో చాలాకాలం నుంచి విన్పిస్తున్నది. కేంద్ర నాయకత్వం ఇందుకు రంగం సిద్ధం చేస్తున్నదని కూడా పదే పదే వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ సాహసం మాత్రం ఎవరూ చేయలేదు. కానీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం ఇప్పుడు ఆ విషయంలో చాలా పట్టుదలగా వున్నాడని చెప్తున్నారు. శాసనసభలో కడప జిల్లాకు చెందిన ఒక మంత్రి నేరుగా సాక్షి విలేకరి వద్దనే ఈ మాట తూలాడు. మీ పత్రికలో నానా చండాలం రాస్తున్నారని సాక్షి విలేకరిని నిలదీసిన ఆ మంత్రి, అయినా మీరేమి చేస్తారులే, మీ యజమానిని త్వరలోనే బొక్కలో తోస్తున్నాము, అప్పుడు కానీ మీకు బుద్ధి రాదు అని వ్యాఖ్యానించాడు.

ఓబుళాపురం ఇనుప ఖనిజం గనులు, బ్రాహ్మణి ఇన్ఫోటెక్ కంపెనీ భూకేటాయింపులలో జగన్ ప్రమేయాన్ని, భాగస్వామ్యాన్ని నిర్ధారించి,

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్పేస్



మీకూ పరీక్షలు మొదలయ్యాయా డాడీ!?



సిగ్గులేని సింగ్

ప్రధానమంత్రిగా ఎన్నిక కావడానికి, కొనసాగడానికి మన్మోహన్‌సింగ్‌కు వున్న ఏకైక అర్హత – ఆయన వ్యక్తిత్వం. మచ్చ లేని మనిషని, నీతి నిజాయితీలకు సంకేతమని, రాజకీయ ముసుగు కూపంలో ప్రభవించిన పద్మమని, పదవీ దాహం లేని వాడని, అధికార దుర్వినియోగం అంటే ఏమిటో తెలియని వాడని, స్వంత లాభం కోసం తాపత్రయపడడని గొప్పగా చెప్పు కొంటాము ఆయన గురించి. ఆర్థిక శాస్త్రవేత్త అన్నది ఆయన అదనపు లక్షణమే తప్ప, ప్రధాని కావడానికి అది ప్రామాణిక అర్హతగా ఏనాడూ పరిగణనకు రాలేదు. దేశంలోని ఏ నియోజక వర్గంలో కూడా ప్రజల ఓట్లతో గెలవలేని బలహీనుడైనప్పటికీ, ఒకటికి రెండు పర్యాయాలు యుపిఏ ప్రభుత్వానికి ఆయన్ను ఏకగ్రీవ నేతగా ఎన్నుకోవడానికి కారణం ఆయన వ్యక్తిత్వం మాత్రమే. ఏడేళ్ల సావాసం చేస్తే వారు వీరౌతారనే సామెత తను నిజం చేస్తున్నాడిప్పుడు మన్మోహన్‌సింగ్. గత కొద్ది రోజులుగా ఆయన వ్యక్తిత్వంపై కమ్ముకొంటున్న నీలి నీడలు, ప్రధానిగా ఆయన పనితీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు పరిశీలిస్తే, ఎంతటివాడు ఎంతగా పతనమై పోయాడా అన్న ఆవేదన కల్గుతున్నది. కామన్ వెల్త్ గేమ్స్ నిర్వహణ దేశ ప్రతిష్ఠకు సంబంధించిన అంశం. కానీ ఆ బాధ్యతను కల్మాడీ వంటి రాజకీయ విదూషకుల చేతిలో పెట్టాడు మన్మోహన్ సింగ్. ఫలితం, ఆటల పేరుతో వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దోపిడీ. ప్రారంభానికి టెంకాయ కొట్టబోతే, పేకమేడల వలె కుప్పకూలి పోయాయి స్టేడియం నిర్మాణాలు. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రతినిధులు దేశం పరువును పక్కనే వున్న యమునలో కడిగి పారేశారు. కానీ ఈ రోజుకీ ఆ కల్మాడీ మీద కనీసపాటి చర్య తీసుకోలేక పోతున్నాడు ప్రధాని. లక్షా డెబ్భై వేల కోట్ల మేర ఖజానాకు కన్నం వేసిన 2జి స్పెక్ట్రం స్కాం నిందితులను రక్షించడానికి చివరి నిముషం వరకు విఫల ప్రయత్నం చేశాడు ప్రధాని. సుప్రీంకోర్టు గట్టిగా మొట్టికాయ వేయబట్టి, కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి రాజాను సిబిఐ అరెస్ట్ చేయగల్గింది తప్ప, లేకుంటే అన్ని లక్షల కోట్లు బొక్కిన భోక్తలందరూ ఇప్పటికీ పదవులలో భోగం అనుభవిస్తూ వుండే వారన్నది నిజం. కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా థామస్ నియామకం తన తప్పే అని పార్లమెంట్‌లో నిస్సిగ్గుగా ఒప్పుకొన్నాడు మన్మోహన్‌సింగ్. ఈ విషయంలో పత్రికలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు ఎంత రచ్చ చేసినా చీమకుట్టినట్లు కూడా భావించ లేదాయన. సుప్రీంకోర్టు చీవాట్ల తర్వాత కానీ నిజం ఒప్పుకో లేదు. ఎక్కడో ఒక రైలు ప్రమాదం జరిగితే, కేంద్ర రైల్వే మంత్రి పదవికి రాజీనామా చేశాడు లాల్‌బహదూర్ శాస్త్రి. ప్రైవేటు బస్సుల జాతీయకరణ విధానాన్ని హైకోర్టు తప్పు పడితే, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిత్వానికి రాజీనామా చేశాడు నీలం సంజీవ రెడ్డి. రాజకీయాలలో నైతిక ప్రమాణాలంటే అట్లా వుండాలి. తన మంత్రివర్గంలోని ఒక అవినీతిపరుడి వల్ల దేశ ఖజానాకు ఒకటిన్నర లక్షల కోట్ల రూపాయల నష్టం జరిగినా, అవినీతి కేసులెదుర్కొంటున్న అధికారిని విజిలెన్స్ కమిషనర్ వంటి అత్యున్నత పదవిలో నియమించిన నేరం తనదేనని ఒప్పుకోక తప్పినా, ప్రధాని పదవి చూరు పట్టుకొని వేలాడే మన్మోహన్ సింగ్‌ను నైతిక విలువలున్న నేతగా చూడడం ఎట్లా సాధ్యం?

ఇప్పుడు అంతకంటే దారుణమైన నేరం బహిర్గతమైనది. గత ప్రభుత్వంపై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన సమయంలో, లోక్‌సభ సభ్యులకు కోట్ల రూపాయల ముడుపులిచ్చి ప్రలోభ పెట్టారని అమెరికా దౌత్యాధికారులు ఇచ్చిన నివేదికలను వికీ లీక్స్ బయట పెట్టింది. కాంగ్రెస్ నేత సతీష్‌శర్మ ఇంట్లో 50 కోట్ల రూపాయల డబ్బు పెట్టెలను తన కళ్లతో చూశానని ఆ దౌత్యాధికారి చెప్పినట్లుగా దౌత్య కార్యాలయ రహస్య పత్రాలలో విపులంగా వుంది. ఆ పత్రాలు ప్రతిపక్షాల సృష్టి కాదు. ఇప్పుడు కల్పించి నవీ కావు. ప్రజాస్వామ్యాన్ని క్రూరంగా పరిహసించిన సమయంలోనే, ఒక విదేశీ దౌత్యాధికారి తన ప్రభుత్వాధిపతులకు తెలియజేసిన సమాచారం మాత్రమే. వాటి విశ్వసనీయతను శంకించే అవకాశమే లేదు. అయినా సరే, తాను తన పదవిని కాపాడుకోవడానికి ఎవరికీ డబ్బు ఇవ్వలేదని దేశ ప్రజల ముందు బుకాయిస్తున్నాడు మన్మోహన్‌సింగ్. ఇంత దారుణమైన నేరం బయటపడిన తర్వాత, దాని నిజానిజాలు నిర్ధారించే వరకైనా పదవి వదలి పెట్టి, శీలపరీక్షకు సిద్ధం కావడానికి మనసు రావడం లేదాయనకు. తన పెళ్లాం పక్కింటి వాడితో లేచిపోయి ఎదురింట్లో కాపురం పెట్టినా సహించగలను కానీ, మంత్రిపదవి పోతే మాత్రం బ్రతకలేననే రక్త కన్నీరు నమూనా రాజకీయవాది వలె ప్రవర్తిస్తున్నాడు మన్మోహన్‌సింగ్. సిగ్గు అనేది లేశమాత్రం లేని నీచస్థాయి రాజకీయవాది వలె ప్రవర్తిస్తున్నాడు. పదవి కోసం ఇంతగా నైతిక విలువలను పాతర వేసిన మన్మోహన్‌సింగ్‌ను ఆ పదవిలో ఒక్క క్షణం కొనసాగించినా, దేశానికి అరిష్టమే తప్ప మేలు జరగదు.

జమీన్‌రైతు

జనవాణి

జపాన్ నుంచి పాఠాలు నేర్చుకోవాలి!

జపాన్‌ను కుదిపేసిన భూకంపం ఆ తర్వాత సంభవించిన సునామి, అణువిద్యుత్ కర్మాగారాలలో పేలుడు తర్వాతనైనా జనంలో మార్పు వస్తుందా అనే అనుమానం ఇంకా కలుగుతూనే వుంది. జపాన్ శాస్త్ర సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశం. కాని ప్రకృతి శక్తి ముందు దీనంగా తలవంచింది. మానవుడిలో స్వార్థం పెచ్చు పెరిగిపోయింది. ఏదో సాధించేశానన్న గర్వంతో ప్రకృతిని ధ్వంసం చేస్తూ పోతున్నాడు. ఇది తగదని నిన్నటి జపాన్ బీభత్సం లోకానికి చాటి చెప్పింది.

పి.అరుణకుమారి నెల్లూరు

టీవీ ఛానల్స్‌కు తగదు!

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు జాతకాలు, జ్యోతిష్యాలను నమ్మితీరాలన్న రీతిలో టీవీల్లో ప్రతి నిత్యం హోరెత్తిస్తున్నారు. ఉదయం ఆరుగంటల నుంచి ఎనిమిది గంటల వరకు టీవీల్లో ఇవే కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి. ఓ టీవీలో సిద్ధాంతి ఆ రోజు ఏ దైవాన్ని ఆరాధించాలో, ఏ బట్టలు వేసుకోవాలో కూడ చెప్పేస్తున్నాడు. కాని ఒక టీవీలో జోతిష్య పండితుడు చెప్పిన విధంగా మరో టీవీలో పండితుడు చెప్పడం లేదు. అమాయక ప్రజలు దేన్ని నమ్మాలి. టీవీ ఛానళ్ల నడపడం కోసం జనాన్ని పాత రాతియుగానికి మళ్లీ తీసుకోపోవడం బాధాకరం.

సోలా జానకీదేవి నెల్లూరు

కడుపు రగిలిపోయింది

మందార మకరంద మాధుర్యమున దేలు... వంటి ఎన్నో వందల పద్యాలను రచించి ప్రజలనుభక్తి పారవశ్యంలో ఓలలాడించిన బమ్మెరపోతన విగ్రహానికి ట్యాంక్‌బండ్‌పై ముఖం చెక్కేసి మెడలో గులాబీ కండువాను చుడుతుంటే చూసి కడుపు రగిలిపోయింది. బోఫోర్స్ కుంభకోణంలో భోక్తలు, 2జి స్కాంలో లోతు దర్యాప్తుల మాదిరి ఈ విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కూడ అరెస్ట్ చేయకపోవడం దారుణం.

టి.కోటేశ్వరరావు కోవూరు

ఉపాధి కల్పన మంచి పథకం

కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్ల నుంచి అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం పేదలకు వరం. ఈ మధ్యనే గతంలో వుండిన వంద పని దినాలను 125 దినాలుగా పెంచడం, గతంలో రోజు కూలీగా వుండిన 100 రూపాయలకు అదనంగా మరో 21 రూపాయలను పెంచి ఇవ్వడం సంతోషకరం. ఉపాధి పథకం కొందరికి మోదం అయితే కొందరికి ఖేదంగా వుంది. అయితే

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

28-3-1941
పేజీలు : 12 వెల: అణా

నెల్లూరు నుండి బళ్లారికి

తేది 26 మధ్యాహ్నం 12.30 గంటల ప్యాసెంజరు బండిలో సత్యాగ్రహి ముత్తరాజు గోపాలరావు గారిని నెల్లూరు సబ్‌జైలు నుండి ఆలీపూరు(బళ్లారి) జైలుకు తీసుకపోయిరి.

నెల్లూరు మున్సిపల్ కమీషనర్

ప్రస్తుతం కమీషనర్‌గా వున్న అన్నదేవుల రామచంద్రారెడ్డి గారు తిరిగి తహశీల్దారయ్యేదరట. ఇది ఉద్యోగ రీత్యా జరిగిన సాధారణ మార్పేనంటున్నారు.

మార్చి 31వ తేదీన సత్యాగ్రహులు

రేబాల దశరధరామిరెడ్డి గారు ఉదయం 10 గంటలకు నెల్లూరులోనూ, మేనకూరు సీతారామరెడ్డి బుచ్చిలో ఉదయం 8 గంటలకు, కోవి బసవయ్య నాయుడు ఉదయగిరి తాలుకా చాకల కొండలోను సత్యాగ్రహం చేసెదరు.

విక్టోరియా రూపాయలు చెల్లవు

విక్టోరియా రూపాయలు, అర్థ రూపాయలు 31-3-41 వరకూ అన్ని ఆఫీసుల్లో తీసుకుంటారు. తర్వాత చెల్లవు. కానీ 30-9-41 వరకూ గవర్నమెంటు ట్రెజరీలు, పోస్టాఫీసుల్లో మాత్రం తీసుకొంటారు. రిజర్వు బ్యాంకు ఆఫీసుల్లో మాత్రం తిరుగా ప్రభుత్వపు ఉత్తర్వుల వరకూ తీసుకుంటారు.

కావలిలో సత్యాగ్రహం

చెదలవాక లక్ష్మీకాంతారావు గారు ఏప్రెల్ 2వ తేదీన సత్యాగ్రహం చేసెదరు.

50 ఏళ్ల క్రితం ఈవారం

24-3-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

నెల్లూరులో పోలియో

కృష్ణ, గుంటూరు జిల్లాలలో వ్యాపించి వున్న పోలియో వ్యాధి(శిశు పక్షవాతం) నెల్లూరు జిల్లాకు గూడా దిగుమతియైనది. ఇప్పటివరకు ఈ వ్యాధికి అయిదు మంది బిడ్డలు గురయ్యారని తెలుస్తున్నది.

నెల్లూరు పెద్దాసుపత్రికి ఈ వ్యాధికి గురియైన సంవత్సరం లోపు పిల్లలు యిరువురు చికిత్స కోసం తీసుకరాబడినారు; వారిలో ఒకరు ఆసుపత్రిలో చేర్చబడి చికిత్స బొందుతున్నదని, మరొక బిడ్డ ఔట్ పేషెంటుగా చికిత్స బొందుతున్నదని తెలుస్తున్నది. ఈ కేసులు రెండు నెల్లూరు టౌన్‌వేనన్నారు.

కావూవీధికి చెందిన ఒక అయిదేళ్ల బాలికకు గూడా ఈ వ్యాధి వ్యాపించింది. ఆ బాలిక డాక్టర్ పుచ్చల పల్లి రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో చికిత్స బొందుతున్నది. డాక్టర్ జె.ఆదినారాయణయ్య గారి ఆస్పత్రిలో 1 1/2 సంవత్సరము వయస్సు గల మగబిడ్డ, మరొక 1 1/2 సంవత్సరం ఆడబిడ్డ ఈ వ్యాధికి చికిత్స బొందుచున్నది. వారి ముఖము, కండ్లకు పోలియో వ్యాధి వ్యాపించిందట.

సానుభూతి

మూడుసార్లు జైలు శిక్షననుభవించిన దేశ భక్తురాలు శ్రీమతి ముత్తుకూరు కామమ్మ 10వ తేది ముత్తుకూరులో మరణించారట.

ఉప్పు సత్యాగ్రహులకు భోజన ఫలహారాదులిచ్చిన కారణంగా మునిసిఫ్ ఉద్యోగాన్ని పోగొట్టుకున్న కావలి తాలుకా ముణ్ణంగి దిబ్బవాసి గాడేపల్లి రామయ్య 14వ తేది నెల్లూరు పెద్దాసుపత్రిలో కాలధర్మం జెందారు.

పై యిరువురి కుటుంబాలకు మా సానుభూతి.

నెల్లూరు ముచ్చట్లు విలేకరులు

ఆద్యంతం ఉత్కంఠ భరితం

శాసన మండలి నెల్లూరు స్థానిక సంస్థల స్థానానికి 23వ తేది జరిగిన ఓట్ల లెక్కింపు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా జరిగింది. లెక్కింపు మొదలు కాగానే తొలి ఓటు వాకాటి నారాయణ రెడ్డికి పడింది. మొదటి పది ఓట్ల లెక్కింపులో నారాయణరెడ్డికే ఎక్కువ ఓట్లు రాగా, ద్వితీయ స్థానంలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిలిచారు. అక్కడ నుంచి జరిగిన లెక్కింపులో ఒక ఓటు వాకాటి నారాయణరెడ్డికి వస్తే మరో ఓటు ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వచ్చింది. విజయానికి అవసరమైన చివరి ఓటు కూడా వాకాటి నారాయణరెడ్డికే పడడం విశేషం. తనకు తక్కువ ఓట్లు పడడం గమనించిన బీద రవిచంద్ర కౌంటింగ్ కాకమునుపే బయటకు వచ్చేశారు.

కౌంటింగ్‌కు రాని వాకాటి!

నెల్లూరు స్థానిక సంస్థల స్థానానికి 23వ తేది ఎమ్మీఓ ఆఫీసులో జరిగిన కౌంటింగ్‌కు తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసిన బీద రవిచంద్ర, జగన్ గ్రూపు తరపున పోటీచేసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వచ్చి కూర్చోగా కాంగ్రెస్ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి మాత్రం రాలేదు. ఆయన తరపున ఆనం విజయకుమార్‌రెడ్డి కౌంటింగ్‌లో కూర్చొన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్లతో గెలుపుకు దగ్గరగా వచ్చారన్న సమాచారం అందుకొన్న తర్వాత వాకాటి నారాయణ రెడ్డి కౌంటింగ్ కేంద్రానికి తరలి వచ్చారు. లేచి వచ్చేసినట్లు కనపడ్డారు. కలెక్టర్ రాంగోపాల్ కౌంటింగ్ ముగిసే సమయంలో వచ్చారు. జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, డిఆర్వో జయరామయ్య, నెల్లూరు ఆర్డీఓ వేణుగోపాల్‌రెడ్డి కౌంటింగ్ బరువు బాధ్యతలన్నీ మోశారు. నెల్లూరు నగర డిఎస్పీ రాధిక విలేకరులకు కేటాయించిన ఛాంబర్‌లో నిలబడి కౌంటింగ్‌లో అభ్యర్థుల ఆధిక్యతను గమనిస్తూ తనదైనశైలిలో కామెంట్లు చేస్తూ కనిపించింది.

వాకాటిని అభినందించిన ప్రతాప్!

వాకాటి నారాయణరెడ్డి నెల్లూరు స్థానిక సంస్థల స్థానం నుంచి గెలుపొందిన వెంటనే ఆయన్ను రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డే తొలుత అభినందించారు. నారాయణ రెడ్డి కూడా ఆయన్ను ఆలింగనం చేసుకొని రాజకీయాలకు అతీతమైనది స్నేహబంధమని చాటి చెప్పారు.

లిల్లీలిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో సరస్వతీ పూజ

నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లీ టిల్ ఫ్లవర్ స్కూల్‌లో 10వ తరగతి చదివే విద్యార్థులు 20వ తేది సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఇసి నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు 10వ తరగతి తొలిమెట్టన్నారు. బాగా చదివి మంచి మార్కులు పొంది తల్లితండ్రులు, స్కూల్‌కు పేరు తేవాలన్నారు.

క్యాన్సర్ వైద్యశాలకు జెవిరెడ్డి విరాళం

నెల్లూరు పొదలకూరు రోడ్డులోని క్యాన్సర్ ఆసుపత్రికి కస్తూరిదేవి విద్యాలయం కరస్పాండెంట్ జెవిరెడ్డి ఐదు లక్షల రూపాయల విరాళం అందించారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ టి.లక్ష్మికి ఈ మొత్తాన్ని అందించిన ఆయన క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్య సేవలు అద్భుతంగా వున్నాయని ప్రశంసించారు.

17 గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం!

నెల్లూరు నగరం చుట్టుప్రక్కల వున్న 17 గ్రామాలను కార్పొరేషన్‌లో కలుపుతూ ప్రత్యేక జిఓ విడుదల కానుంది. ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ జిఓ విడుదల కానుంది. ప్రత్యేక జిఓలో అల్లీపురం, నవలాకుల తోట, సౌత్‌రాజుపాళెం, చింతారెడ్డి పాళెం, వావిలేటిపాడు, ధనలక్ష్మీపురం, గుండ్లపాళెం, కనుపర్తిపాడు, కల్లూరు పల్లి, బుజబుజ నెల్లూరు, కొత్తూరు, పొట్టేపాళెం, అంబాపురం, పెద్ద చెరుకూరు, కోడూరుపాడు, నారాయణరెడ్డిపేట, గుడిపల్లిపాడు గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించనున్నారు. కొత్త గ్రామాల చేరిక వల్ల నగర పరిధి 101.27 చదరపు కిలోమీటర్ల నుంచి 149.66 కిలోమీటర్ల మేర పెరుగుతుంది. నగరంలో వున్న ఎన్నో ప్రాంతాల్లో ఇప్పటికే ప్రాథమిక సౌకర్యాలు అడుగంటి వున్నాయి. కొత్త గ్రామాల కలయిక గాదు; ప్రాథమిక సౌకర్యాల కల్పనకు నేతలు, అధికార వర్గం ప్రయత్నం చేయాలి.

కనకమహల్‌ను అమ్మలేదు!

జమీన్‌రైతు మార్చి 4వ తేది సంచిక ట్రంకురోడ్డు కబుర్లలో 'కనక మహల్ కనుమరుగు' శీర్షిక పేరిట వచ్చిన వార్తకు పి.సమీర్‌బాబు వివరణ పంపారు. కనకమహల్‌ను ఇప్పటికీ ఎవరికీ అమ్మలేదని స్పష్టం చేశారు.

పొట్టి శ్రీరాములు జయంతి

అమరజీవి పొట్టి శ్రీరాములు 111 జయంతిని నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఘనంగా జరిపింది. కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన ఆర్యవైశ్య నాయకులు ఆత్మకూరు బస్టాండ్ వద్ద శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పలువురు పేద ఆర్య వైశ్యులకు జిల్లా కలెక్టర్ రాంగోపాల్ చేతుల మీదుగా తోపుడు బండ్లు, గ్రైండర్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోట గురుబ్రహ్మం, తులసి చంద్రశేఖర్, జొన్నలగడ్డ మోహన్ రావు, శేషు షణ్ముగం, బివి నరసింహం, ముక్కాల ద్వారకానాథ్, యేల్చూరి లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వైద్యశిబిరం

నెల్లూరు నగరంలోని వివిధ మీడియాల్లో పనిచేసే జర్నలిస్టులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు 20వ తేది ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. చెన్నైలోని విజయ హార్ట్ ఫౌండేషన్‌లో సీనియర్ వైద్యుడు డాక్టర్ ఎం.విజయ కుమార్ 100 మందికి పైగా జర్నలిస్టులకు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు జరిపి అవసరమైన వైద్య సలహాలిచ్చారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సంతోష్‌కుమార్, సి.ఎన్.వి. రమణ ప్రసాద్ పర్యవేక్షించారు.

పోలియో నిర్మూలనకు విరాళం

ప్రపంచవ్యాప్తంగా పోలియా వ్యాధి నివారణకు రోటరీ క్లబ్ విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా నెల్లూరు దర్గామిట్టలోని ప్రగతి మహావిద్యాలయ విద్యార్థులు 7930 రూపాయలు సేకరించి నెల్లూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.రాఘవేంద్ర షెట్టికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం కరస్పాండెంట్ బెజవాడ ప్రత్యూషా రెడ్డి, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను పోలింగ్ కేంద్రంలోనికి పంపలేదు

కావలి, గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, బల్లి దుర్గా

కొరవ 14వ పేజీలో

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ్ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పొగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

బంగారం స్పెషల్ ఆఫర్

BIS 916 హాల్‌మార్క్

బంగారు ఆభరణములపై

సవరకు రూ.400/- తగ్గింపు.

గ్రాముకు రూ.50/- తగ్గింపు.

డైమండ్స్ పై 10% తగ్గింపు.

గోల్డ్ ప్యాలెస్

హోటల్ శివం ఎదురుగా,

జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,

ఆచారివీధి, నెల్లూరు.

ఫోన్: 2331133, 2327611

అమ్మబడును

నెల్లూరు గోమతి స్కూల్ ప్రక్కన ఒక ఎకరం స్థలం అమ్మబడును.

——: సంప్రదించండి :——

94415 79627

ఖాళీ స్థలం అమ్మకం

గుడిపల్లిపాడు గ్రామం సాయిబాబా మందిరం వెనుక ఉత్తరపు వాకిలి కలిగిన 19 అంకణముల ఖాళీ స్థలం అమ్మకమునకు కలదు.

——: వివరములకు :——

95330 94863

92467 77010

పొలం అమ్మబడును

నెల్లూరు జిల్లా గూడూరు మండలం కాండ్ర గ్రామంలో సుమారు 40 ఎకరముల మెట్టభూమి అమ్మకమునకు కలదు.

—— వివరములకు ——

098450 43636

094487 86543

మానస సరోవర్, ముక్తినాథ్, మనోకామనా విమాన ప్రయాణం

20 రోజులు 6 యాత్రలు

1,20,000/- రూపాయలు మాత్రమే

—: దర్శించు క్షేత్రములు :—

1. లుంబిని 2. పోక్రా 3. ముక్తినాథ్ 4. మనోకామన 5. ఖాట్మండ్ 6. మానస సరోవర్ (కైలాస పర్వత దర్శనం మరియు పరిక్రమణ)

హైదరాబాద్ నుండి ఖాట్మండ్

ఖాట్మండ్ నుండి హైదరాబాద్ విమాన ప్రయాణం

ఖాట్మండ్ నుండి మానస సరోవర్‌కు

ల్యాండ్‌క్రూయేజర్ జీపులో రోడ్ ప్రయాణం.

—— : వివరములకు సంప్రదించండి : ——

శ్రీ సాయి దుర్గా యాత్ర స్పెషల్

7-2-1087/A/63, రాజ రాజేశ్వరీ నగర్ కాలనీ, బి.కె.గూడ, హైదరాబాద్ - 500 038.

యన్.వి. చలపతి రావు - సెల్ : 92462 66874

నెల్లూరు డివిజన్‌లో చకా చకా పోలింగ్



పోలింగ్‌కు బారులు తీరిన ఎమ్పీటీసీలు.

● మధ్యాహ్నానికే పూర్తి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 21తేదీ జరిగిన పోలింగ్ నెల్లూరు డివిజన్‌లో ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ పరిధిలో 12 మండలాలున్నాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ మొదలైనా రాహుకాలం కావడంతో తొమ్మిది గంటల వరకు ఓటర్లు రాలేదు. తొమ్మిదిన్నర ప్రాంతంలో బుజబుజ నెల్లూరు ఎమ్పీటీసీ శకుంతల వచ్చి తొలి ఓటేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఎన్నికల ఏజంట్ ఆనం విజయకుమార్‌రెడ్డి నేతృత్వంలో పెద్దసంఖ్యలో తరలి వచ్చిన ఎమ్పీటీసీలు, జడ్పీటీసీలు ఓటు వేశారు. 10.45 ప్రాంతంలో జగన్ వర్గీయులైన స్థానిక సంస్థల ప్రతినిధులు వచ్చి ఓటు వేశారు. ఈ సమయంలోనే తెలుగుదేశం పార్టీ చీఫ్ ఎన్నికల ఏజంట్ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీని బలపరచే జడ్పీటీసీ, ఎమ్పీటీసీలు తరలివచ్చారు. 10.30 నుంచి 12 గంటల మధ్య డివిజన్‌లో నమోదై వుండిన 192 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చకచకా ఓట్లు వేశారు. ఎఎస్‌పేట మండలాధ్యక్షురాలు రాజేశ్వరమ్మ, పొదలకూరు మండలాధ్యక్షుడు మహేంద్ర చివరి ఓట్లు వేశారు. జగన్ వర్గం తరపున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 11.50 ప్రాంతంలో పోలింగ్ జరిగిన ఎమ్డీఓ కార్యాలయంలోని కేంద్రానికి వెళ్లి పరిశీలించి వస్తూ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకొన్నట్లు మీడియాకు చెప్పారు. నాలుగుగంటల వరకు పోలింగ్‌కు గడువున్నా 12 గంటలకే పోలింగ్ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. నెల్లూరు రూరల్ మండలం నుంచి 31, వెంకటాచలం నుంచి 16, తోటపల్లి గూడూరు నుంచి 15, కలువాయి నుంచి 14, ఎఎస్‌పేట నుంచి 10, ఆత్మకూరు నుంచి 18, రాపూరు నుంచి 19, చేజర్ల నుంచి 11, అనంతసాగరం నుంచి 12, ఇందుకూరుపేట నుంచి 17, పొదలకూరు నుంచి 19, ముత్తుకూరు నుంచి 15 మంది స్థానిక సంస్థల ప్రతినిధులు ఓట్లు వేయడంతో నెల్లూరు డివిజన్ పరిధిలో నూటికి నూరు శాతం పోలింగ్ నమోదయ్యింది.

నీతి నిజాయితీలకు కట్టుబడతాం!

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలిచిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి సభ్యులు విరపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులరెడ్డిల విజయోత్సవ ర్యాలీ నెల్లూరులో జరిగింది. 17వ తేది తొలిసారిగా వారు నెల్లూరు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని అయ్యప్పగుడి, నిప్పో, ఎల్‌ఐసి, ఆర్టీసి, విఆర్‌సి, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ నుంచి ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్ సెంటర్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారికి భారీ ఎత్తున స్వాగతం పలికారు. గాంధీబొమ్మ సెంటర్‌లో మెడికల్ రెప్‌లు, ఆత్మకూరు బస్టాండ్ వద్ద సిఐటియు కార్మికులు జత కలిశారు. మార్గ మధ్యంలోని అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ, పుచ్చలపల్లి సుందరయ్య, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేశారు.

ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో ఎమ్మెల్సీల అభినందన సభ జరిగింది. మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పాత శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఏడుగురుండేవారని, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి డాక్టర్ గేయానంద్ విజయంతో ఆ సంఖ్య ఎనిమిదికి పెరిగిందన్నారు.



ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి అభినందన సభలో నేతల సంఘీభావ దృశ్యం.

ఎమ్మెల్సీ విరపు బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రత్యర్థులు ఎన్ని వ్యూహాలు పన్నినా పనిచేసే వారిని ఎన్నుకొని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికలోకం తమ నిజాయితీని చాటిందన్నారు. శాసనమండలిలో విద్య, ఆరోగ్యం, ఉద్యోగుల సమస్యలపై గళం విప్పుతామన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అసోసియేషన్ నాయకులు, యుటిఎఫ్ నాయకులు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు, ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం నాయకుడు, లెక్చరర్స్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● క్లస్టర్ల ఏర్పాటుపై

తర్జన భర్జన

జిల్లాలోని గ్రామీణ పంచాయితీలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం తర్జన భర్జన పడుతుంది. ప్రస్తుతం జిల్లాలో 961 గ్రామ పంచాయితీలు వున్నాయి. రెండు మూడు పంచాయితీలను కలిపి ఒక క్లస్టర్ పంచాయితీగా ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అయితే క్లస్టర్ల ఏర్పాటులో రాజకీయ జోక్యం చోటుచేసుకోవడంతో అధికారులు ఏంచేయాలన్న దానిపై సమాలోచనలు చేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయితీలలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందినవారు సర్పంచ్‌లుగా కొనసాగుతున్నారు. మరికొన్ని పంచాయితీలలో సిపిఎంకు చెందినవారు వున్నారు. గ్రామ రాజకీయాలకు గ్రామ పంచాయితీలే వేదికగా వుంటున్నాయి. రాజకీయ పార్టీల ఆధిపత్యం ఎక్కడ చేజారిపోతుందోన్న భయంతోనే క్లస్టర్ల ఏర్పాటుకు కొందరు రాజకీయ నేతలు అడ్డుపడుతున్నట్లు తెలుస్తుంది. 961గా వున్న గ్రామ పంచాయితీలను 300 పంచాయితీలుగా ఏర్పాటు చేసేందుకు పంచాయితీ అధికారులు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగింది. క్లస్టర్ల ఏర్పాటులో పంచాయితీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది కొరత తీరుతుందన్నది ప్రభుత్వ అభిప్రాయం. రాజకీయ జోక్యం కారణంగా క్లస్టర్ల ఏర్పాటు కాస్త వెనక్కు వెళ్లే అవకాశం కనిపిస్తుంది.

ఆర్టీసి పాట్లు

ప్రయాణీకులను ఆకట్టుకొనే యత్నం

సమయానికి గ్రామానికి వచ్చి ఖచ్చితమైన సమయానికి ప్రయాణీకులను గమ్యం చేర్చే విషయాన్ని ఆర్టీసి ఏనాడో మర్చిపోయింది. దీంతో ప్రయాణీకులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొత్త రీజినల్ మేనేజర్ కొమరయ్య ఈ విషయాన్ని గమనించారు. దీన్ని సరిదిద్దను ప్రయాణీకులను ఆకట్టుకొనే ప్రణాళికను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా 17వ తేది విఆర్‌సి కూడలిలో నిలచి వుండిన ముత్తుకూరు



ముత్తుకూరు బస్టాండ్‌లో ప్రయాణికునికి బహుమతినందిస్తున్న డిఎం శేనయ్య.

– నెల్లూరు ఆర్టీసి బస్సులో ఎక్కి వుండిన ప్రయాణీకులకు రెండవ డిపో మేనేజర్ శేనయ్య కూపన్లు పంపిణీ చేశారు. ఈ కూపన్లను డ్రా తీసి ఇద్దరు విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి పొందిన ఎ.లోకనాధరెడ్డి, ద్వితీయ బహుమతి పొందిన బి.మధుసూదనరెడ్డికి బహుమతులుగా హాట్‌బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసి డిపో మేనేజర్ శేనయ్య మాట్లాడుతూ ఆర్టీసి బస్సుల్లో ప్రయాణీకుల సంఖ్య పెంచుకొనేందుకు నెలకు ఒకసారి ఒక్కో రూట్‌లో ప్యాసింజర్ గిఫ్ట్‌స్కీమ్ ద్వారా బహుమతులందజేస్తామన్నారు. సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసి బస్సులలో ప్రయాణించాలన్నారు. బస్సులు సరిగ్గా నడిపితే వాటినెందుకు ఎక్కరు చెప్పండి?

నిరుపయోగంగా మ్యూజియం

సిబ్బంది కొరత, అధికారుల ఉదాసీనత ప్రాచీన కళాఖండాలను, పురాతన వస్తువులను భావితరాలకు పరిచయంచేసే మ్యూజియం కళ తప్పేలా చేస్తున్నాయి. సరస్వతి నగర్‌లో 2006లో ఈ ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. 75 లక్షల రూపాయలు వెచ్చించి దీనిని నిర్మించినప్పటికీ సందర్శకులకు ఉపయోగపడని విధంగా తయారైంది. ప్రాచీన పురాతన నాణేలు, దేవతా బొమ్మలు, కొయ్య బొమ్మలు, శాసనాలు, వృత్తికా శిల్పాలు, లోహపు పాత్రలు, శిల్పకళారూపాలు మ్యూజియంలో దర్శనమిస్తుంటాయి. తగిన విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయకపోవడం, కాలిపోయిన బల్బులను మార్చి క్రొత్త వాటిని పెట్టలేని పరిస్థితిలో ప్రదర్శనశాల వుండడంతో పలు విగ్రహాలు, వస్తువుల వద్ద అంధకారం నెలకొని వుంది. చీకటిలో వుండే ప్రాచీన వస్తువులు, కళాఖండాలను సందర్శకులు చూడలేని పరిస్థితి. ఇక్కడ సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. ఎనిమిది మంది ఉద్యోగులు అవసరం వుండగా నలుగురు మాత్రమే పనిచేస్తున్నారు. పోస్టుల భర్తీకి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో మ్యూజియం.

మ్యూజియం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా వుంది. దీనికితోడు పురావస్తు ప్రదర్శనశాల గురించి ప్రచారం కొరవడింది. జిల్లాలోని చాలా మందికి అక్కడ మ్యూజియం వున్నట్లు తెలియదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి కళ తప్పిన మ్యూజియంకు తగిన సౌకర్యాలు మెరుగుపరిచి వెలుగు నింపాలని ప్రజలు కోరుకొంటున్నారు.


హృదయపూర్వక కృతజ్ఞతలు!
నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల MLC ఎన్నికలను
ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నా విజయానికి బాటలు వేసిన
జిల్లా మంత్రివర్యులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు
మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ MPTC, ZPTC సభ్యులు
కాంగ్రెస్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ...
నాపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లా అభివృద్ధికి
నా శాయశక్తులా కృషి చేస్తానని, ఎల్లవేళలా
మీకు అందుబాటులో వుంటానని తెలియజేస్తూ...
సదా మీ సేవకులో...
వాకాటి నారాయణరెడ్డి MLC
SPSR నెల్లూరు జిల్లా

● ఉపాధి హామీలో

లెక్కలేనంత అవినీతి!

ఉపాధిహామీ పథకంలో అక్రమాలు వెలుగు చూస్తున్నా, అక్రమార్కులపై అధికారులు చర్యలు చేపడుతున్నా వివిధ ప్రాంతాల్లో ఇలాంటివి చోటు చేసుకొంటూనే వున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ దోపిడి అధికంగా వుంది. ఈ పథకానికి సంబంధించి కాంట్రాక్టు సిబ్బంది ఎపిఓలుగా, క్షేత్ర సహాయకులుగా, సాంకేతిక సహాయకులుగా, కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. వీరిలో అధికారులు దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న చందంగా పలు అవకతవకలకు పాల్పడుతుండడంతో అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా అవి నిష్ప్రయోజనం అవుతున్నాయి. గతంలో రామస్వామిపల్లిలో గ్రామస్తులు తిరుగుబాటు చేసి అక్రమాలపై ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అధికారపార్టీ నేతల అండదండలతో ఈ ఆందోళన జరిగినా అధికారులు అక్రమార్కులను తొలగిస్తున్నట్లు ప్రకటించారు తప్ప తిన్న సొమ్మును రాబట్టలేదు. ఇటీవల జంగిల్ క్లియరెన్సు చేపట్టినపుడు వచ్చే కట్టెలను అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు సిబ్బంది. వాస్తవంగా ఆ కట్టెలను వేలం పాట నిర్వహించి వచ్చిన సొమ్మును పంచాయితీకి జమ చేయాల్సి వుంది. షుమారు నాలుగు లక్షల రూపాయల కర్రతుమ్మను బొగ్గు వ్యాపారులకు అమ్మి మూడున్నర వేల రూపాయలు మాత్రమే పంచాయితీకి జమ చేశారట. ఇంతగా దోచుక తింటున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొంటే తప్ప అక్రమాలు ఆగవు.

త్రవ్వినకొద్దీ బయటపడుతున్న అవినీతి



తిరుపతిలోని స్విమ్స్ వైద్య కళాశాల డిఎం ఎండోక్రైనాలజీ విభాగంలో 2010 సంవత్సరానికి బంగారు పతకం పొందిన పొట్టేపాళెం వాసి డాక్టర్ పొన్నాల అమరేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్వీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.ప్రభాకర్‌రావు. మధ్యలో స్విమ్స్ డైరక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ.

నానాపాట్లు పీడుతున్న విద్యార్థులు!


కావలూరు హైస్కూల్‌లో వసతులేవీ?

నాయుడుపేట మండలం కావలూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చదివే విద్యార్థుల పరిస్థితి దారుణంగా వుంది. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు తరగతి గదులు లేకపోవడం, కనీస సౌకర్యాలు లోపించడంతో ఇరుకు గదుల్లో చదువుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలను మూడేళ్ల క్రిందట హైస్కూలుగా చేశారు అధికారులు. పేరుకు ఉన్నత పాఠశాల అయినా వసతులు మాత్రం ఏర్పడకపోవడంతో మొత్తం 270 మంది విద్యార్థులు వున్నప్పటికీ కేవలం మూడుగదుల్లోనే పాఠశాల నిర్వహిస్తుండడంతో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లలు ఆరుబయట చెట్లక్రిందే చదువుకోవాల్సి వస్తుండడంతో తీవ్ర అసౌకర్యాల నడుమే విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. దీనికి తోడు పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పందులు, పశువుల సంచారం అధికంగా వుంది. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు తగిన శ్రద్ధ చూపి విద్యార్థులకు సరిపడే గదులను నిర్మించాలని, సౌకర్యాలను మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుకొంటున్నారు.

శిథిలావస్థకు చేరుకొన్న స్కూల్

పిడతాపోలూరు పంచాయితీ దుర్గపాడు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొనింది. చాలాకాలంగా భవనం బాగోగులు పట్టించుకోక పోవడంతో ఇటీవల శ్లాబ్ పెచ్చులూడి పిల్లలకు చదువు చెపుతున్న విద్యావాలంటీర్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనతో విద్యార్థులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. పాఠశాలకు రావాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తోందని ఉపాధ్యాయులు భయపడుతుండగా, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను శిథిలమైన పాఠశాలకు పంపాలంటే హడలిపోతున్నారు. మరోవైపు ఈ భవనం మరమ్మత్తులకు, కొత్తగా గదులు నిర్మించేందుకు నాలుగు లక్షల రూపాయలు మంజూరైనా ఇంతవరకు పనులు ప్రారంభించిన దాఖలాలు లేకపోవడంతో ఎప్పుడు కొత్త భవనం నిర్మిస్తారో, తమ ప్రాణాలకు రక్షణ ఏర్పడుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు.

బాగోగులు పట్టవా?



పొట్టి శ్రీరాములు 111వ జయంతి సందర్భంగా నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నేతలు తోట గురుబ్రహ్మం, తులసి చంద్రశేఖర్, ద్వారకానాథ్ తదితరులు.

రాష్ట్రపతి పాలన పెట్టండి!

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నందున రాష్ట్రపతి పాలన అమలు చేయాలని కోవూరు శాసన సభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కోట గ్రామానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి ట్యాంక్ బండ్‌పై విగ్రహాలు ధ్వంసం కావడం ఉదాహరణగా చెప్పారు. అదుపు తప్పి ప్రవర్తిస్తున్న ఆందోళనకారులను అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏమీచేయలేని స్థితిలో వున్నారని ఎద్దేవా చేశారు. అవినీతి చక్రవర్తిగా పేరు గాంచిన తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడు అవినీతి గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్ అవినీతికి పాల్పడ్డారంటూ తన పార్టీ పార్లమెంటు సభ్యులచేత ప్రధానికి ఫిర్యాదు చేయించడం హాస్యాస్పదమన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన చంద్రబాబు కోట్లకు పడగలెత్తింది అవినీతికి పాల్పడేనన్న విషయాన్ని మరచి వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. వైఎస్ కుటుంబంపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన చంద్రబాబు అధికారంలోకి ఎలాగైనా రావాలన్న కాంక్షతో జగన్‌పై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఆయన ఎంతగా పరితపించినా అధికారంలోకి రావడం జరగదన్నారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డి స్థానికంగా వుండే శ్రీకామాక్షి దేవి సమేత సోమేశ్వరస్వామికి పూజలు చేశారు.

కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న డిమాండ్



సమస్యలతో సతమతం

బోగోలు మండలంలోని ప్రజలు పలు సమస్యలతో సతమతం అవుతున్నారు. వేసవి కాలం ప్రారంభంలోనే వీరిని మంచినీటి సమస్య చుట్టుముడుతోంది. మండలంలోని అనంతబొట్ల కండ్రిగ తదితర గ్రామాల్లో ప్రజలు మంచినీటికి కటకటలాడుతున్నారు. త్రాగునీటి బోరు వున్నా అది కాస్తా పాడైపోవడం, మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో గుక్కెడు నీళ్ల కోసం మైళ్లదూరం పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పంచాయితీపాలక వర్గం, సంబంధిత అధికారులు బోర్ల మరమ్మత్తులుగాని, మంచినీటి సమస్య పరిష్కారానికిగాని చొరవ చూపకపోవడంతో ముమ్మందు త్రాగునీటికి ఎన్నితిప్పలు పడాలో అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మండలంలోని తాళ్లూరు గ్రామంలో సరైన రహదారులు లేకపోవడంతో గ్రామస్తులు బస్సు ఎక్కాలంటే రెండు కిలోమీటర్లకు పైగా నడవాల్సిన దుస్థితి. గ్రామంలో రోడ్లను నిర్మించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, కలెక్టర్ రాంగోపాల్‌ను కోరినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. పనికి ఆహార పథకంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి జేబులు నింపుకొంటున్నారే తప్ప గ్రామ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు. ప్రయాణీకుల అవసరాన్ని దృష్టిలో వుంచుకొని గ్రామంలో రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుకొంటున్నారు. బోగోలు మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి వుంది.

పాపం... బోగోలు మండల ప్రజలు

రామచంద్రాపురంలో నిధుల స్వాహా!

పంచాయితీ కార్యాలయం వద్ద గ్రామస్తుల ధర్నా

వి డవలూరు మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయితీ నిధులు దుర్వినియోగం జరిగా యంటూ గ్రామస్తులు ధర్నాకు దిగిన వైనం ఇటీవల చోటు చేసుకొంది. 2006 నుంచి 2010 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, పన్నుల రూపంలో వచ్చిన మొత్తాలను సర్పంచ్, అధికారులు స్వాహా చేశారంటూ గ్రామస్తులు, మత్స్యకారులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. సర్పంచ్ ప్రభాకర్ పంచాయితీ సిబ్బందితో కుమ్మక్కై పనులు చేయకుండానే పనులు చేసినట్లు చూపి బిల్లులు చేయించుకొని దిగమింగారని ఆరోపించారు. ఈ అవకతవకలపై పూర్తిగా విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. చివరకు మండల పరిషత్ అధ్యక్షుడు ఓగు నాగేశ్వరరావు, ఎంపిడిఓ గాయత్రి జోక్యం చేసుకొని పంచాయితీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిస్తామని అవి రుజువైతే సర్పంచ్ చెక్‌పవర్ రుద్దు చేయిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు నాగేశ్వరరావు, మీరయ్య, తిరుపతిబాబు, చలపతి, పోలిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ఏర్పాటును అడ్డుకొన్న గ్రామస్తులు

పాఠశాల గ్రౌండ్‌లో పెట్టడమేమిటి?

పా ఠశాల క్రీడా మైదానంలో నర్సరీని నెలకొల్పరాదంటూ మనుబోలు వాసులు అధికారులను అడ్డుకొన్నారు. స్థానిక కోదండరామపురంలో గల జిల్లా పరిషత్ హైస్కూలులోని మైదానంలో నర్సరీ ఏర్పాటు చేయాలని అటవీశాఖ భావించడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీనిపై స్థానికులు మండల పరిషత్ అధికారి సుగుణమ్మకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె అటవీశాఖాధికారులతో కలసి పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, స్థానికులు పాఠశాల మైదానంలో నర్సరీ ఏర్పాటు చేయడం వలన క్రీడలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. తక్షణం అటవీ శాఖ చేపడుతున్న పనులను నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంపిడిఓ గ్రామస్తుల డిమాండ్‌కు తలొగ్గి నర్సరీని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు.



ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతూ పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రేరణ సమావేశంలో సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్. వేదికపై డిఇఓ బాలకాశయ్య, సాంఘిక సంక్షేమ శాఖ ఇడి సీతామహలక్ష్మి తదితరులు.



నెల్లూరు పొదలకూరురోడ్డులోని క్యాన్సర్ ఆసుపత్రికి ఐదు లక్షల రూపాయల విరాళాన్ని అందిస్తున్న కస్తూరిదేవి విద్యాలయం కరస్పాండెంట్ జెవి.రెడ్డి.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి!

ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని కోరుతూ గూడూరులో లోక్‌సత్తా, బాస్ స్వచ్ఛంద సేవాసంస్థలు ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు రవీంద్ర, కృష్ణయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందన్నారు. మట్టిలో కలసిపోని ప్లాస్టిక్ కవర్ల వలన జీవరాశికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్ల బదులుగా పేపర్ కవర్లను వినియోగించాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ ప్రజలను, వ్యాపారులను చైతన్య పరిచేలా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు షబ్బీర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నంలో ట్రాలర్లతో వేట

కేరళ, తమిళనాడు జాలర్ల బరితెగింపు

రా ష్ట్ర సరిహద్దులు దాటి ఇతర రాష్ట్రాల్లోకి ప్రవేశించి సముద్రంలో చేపల వేట నిషేధం. కానీ ఈ నిబంధనలు తోసిరాజని ముత్తుకూరు కృష్ణపట్నం పోర్టులో తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు భారీ ట్రాలర్లతో చేపల వేట సాగిస్తుండడం విశేషం. మత్స్యశాఖ అనుమతితోనే ఇతర రాష్ట్రాల మరపడవలు పోర్టుకు రావాలి. ఈ నిబంధనలు పాటించకుండా కొంతకాలంగా భారీ ట్రాలర్లు పోర్టుకు సమీపంలో సముద్రంలో చేపలవేట సాగిస్తున్నాయి. వీటి సంఖ్య క్రమంగా పెరగడంతో స్థానిక మత్స్యకారులు, మరపడవల యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనాధారాన్ని దెబ్బతీయడంతోపాటు ట్రాలర్ల వలన మరపడవలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని మత్స్యకారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ తెలియదని చెప్పడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

పేదలపాలిట పెన్నిధి జయరామిరెడ్డి


కాంగ్రెస్‌పార్టీలో బలమైన నాయకునిగా వుంటూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటూ మంచిపేరు సంపాదించుకొన్నాడు దివంగత కాటంరెడ్డి జయరామిరెడ్డి. ముత్తుకూరు మండలం నారికేళ్లపల్లి గ్రామానికి చెందిన జయరామిరెడ్డి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. గ్రామసర్పంచ్‌గా నాలుగు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికై పంచాయితీ అభివృద్ధికి విశేష కృషి చేశారు ఆయన. తర్వాత కాలంలో మండల కాంగ్రెస్‌పార్టీలో బలమైన అనుచర వర్గాన్నికల్గి పార్టీని అభివృద్ధి పరచడంలో తనవంతు కృషి చేశారు. సర్వేపల్లి శాసనసభ్యుడిగా పనిచేసిన సివి.శేషారెడ్డి, ఇప్పటి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డితో దగ్గరగా మసిలేవాడు జయరామిరెడ్డి. చనిపోయి ఏడాది గస్తున్నా, గ్రామాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని ప్రజలు నేటికీ మరువ లేకున్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఆకలి కేకలు!


ఏజన్సీలకు రాని బిల్లులు




పా ఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించే నిర్వాహకులకు బిల్లులు అందక సతమతం అవుతున్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో ఏజన్సీలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో దాని ప్రభావం విద్యార్థులపై పడుతోంది. అటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టలేక, ఇటు పని మానుకోలేక నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో పరిస్థితి ఇలాగే వుంది. మనుబోలు మండలంలో పరిశీలించినట్లయితే 76 పాఠశాలలకు చెందిన 54 ఏజన్సీలకు బిల్లులు చెల్లింపు జరుగకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వీటిలో 49 ప్రాథమిక పాఠశాలలు, 16 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలలు, 6 ప్రత్యామ్నాయ పాఠశాలలు వున్నాయి. గత అక్టోబర్ నుంచి ప్రాథమిక పాఠశాలల భోజన నిర్వాహకుల బిల్లులు చెల్లింపు జరుగలేదు. నవంబర్ నుంచి ఉన్నత పాఠశాలలకు, డిసెంబర్ నుంచి ప్రాథమికోన్నత పాఠశాలకు భోజన నిర్వాహకులకు 9 లక్షల రూపాయలు చెల్లించాల్సి వుంది. సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఏజన్సీలకు భోజనం సరఫరా చేయడం తలకు మించిన భారం అవుతోంది. అధికారులు ఆహారాన్ని సక్రమంగా అందజేయాలని చెప్పడం తప్ప తాముపడే కష్టాలు పట్టించుకోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.



కెసిఆర్ మ్యాచ్ ఫిక్సింగ్



టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ కాంగ్రెస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నారా! ప్రస్తుతం రాజధానిలో ఇదే విషయమై వాడివేడిగా చర్చించుకుంటున్నారు. మిలియన్ మార్చ్ తర్వాత కెసిఆర్ వ్యూహాత్మక మౌనానికి కూడా మ్యాచ్ ఫిక్సింగ్ కారణమని గులాబీ వర్గాలే చెబుతున్నాయి. దీంతో టీవీ ఛానెళ్లు కూడా ఓ అడుగు ముందుకేసి మ్యాచ్ ఫిక్సింగ్‌పై చర్చా కార్యక్రమాలు కూడా పెట్టాయి. టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేశాక తెలంగాణపై అధిష్టానం ఓ ప్రకటన చేస్తుందన్నది ఈ మ్యాచ్‌ఫిక్సింగ్ అంతరంగం. కాగా జెఎసి ఛైర్మన్ కోదండరామ్ మాత్రం కెసిఆర్ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడు. ముందుగా తెలంగాణ ఇస్తేనే కెసిఆర్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవాలన్నది కోదండరామ్ అభిప్రాయం. అయితే కెసిఆర్ మాత్రం మ్యాచ్‌ఫిక్సింగ్‌ను బహిరంగంగా ఖండిస్తున్నా లోలోపల ఢిల్లీ కాంగీ పెద్దలతో 'టచ్'లో వుంటున్నట్లు టిఆర్ఎస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.




'గంగ' చిందులు పని చేయలేదు



పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గంగా భవానీ వేసిన 'చిందులు' ఏమాత్రం పని చేయలేదు. ఓటర్లతో కలసి ఆమె వేసిన 'స్టెప్పులు' ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. జగన్ అభ్యర్థి మేకా శేషుబాబు చేతిలో గంగాభవానీ ఘోరంగా ఓడిపోయారు. జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మన్‌గా వున్న శేషుబాబుపై పోటీకి 'గంగ' మొదటి నుంచీ విముఖంగా వున్నారు. జిల్లా కాంగ్రెస్ కూడా 'గంగ' అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించింది. అయినా సిఎం మూర్ఖంగా 'గంగ'ను బరిలోకి దించి అవమానాన్ని మూటగట్టుకున్నారు. 'గంగ' తరపున సిఎం ప్రత్యక్షంగా రంగంలోకి దిగి క్యాంపు పెట్టించినా, డబ్బులు పంచినా కూడా 'గంగ' గెలుపు గీతను దాట లేకపోయింది. ఇక్కడ జగన్ వర్గీయుడు గెలుపొందడంతో సిఎంకు అదనపు తలనొప్పి మొదలైందని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కొంటున్నాయి. పాపం! కిరణ్!!

జ'గన్' పేలింది



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ 'గన్' పేలింది. దీని ప్రభావం రాష్ట్ర రాజకీయాల కంటే సిఎం కిరణ్ మీదనే ఎక్కువగా వుండబోతుందని రాజకీయవర్గాల్లో చర్చ మొదలైంది. పశ్చిమ గోదావరి జిల్లా, కడపజిల్లా, చిత్తూరు జిల్లాలో జగన్ అభ్యర్థులు గెలుపొందగా, నెల్లూరుజిల్లాలో స్పల్ప తేడాతో జగన్ అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఓడిపోయాడు. కడప జిల్లాలోని ఎన్నికల్ని కాంగ్రెస్ ప్రతిష్టాకరంగా తీసుకొని, నలుగురు మంత్రుల్ని ఇన్‌చార్జ్‌గా పెట్టినా జగన్‌వర్గం నాలుగు ఓట్లతో బయటపడింది. సొంత జిల్లాలో జగన్ 'గన్' పేలకుండా చేయాలన్న సిఎం ఆశలపై ఓటర్లు నీళ్లు చల్లారు. మెజార్టీ కేవలం రెండు ఓట్లే అయినా జగన్‌కు నైతిక విజయం లభించిందంటూ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీయులు చెబుతున్నారు. నెల్లూరుజిల్లాలో కాంగ్రెస్ వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి వాకాటి నారాయణరెడ్డి కోసం కృషి చేశాయి. అయినా జగన్ అభ్యర్థి గట్టిపోటీ ఇవ్వడాన్ని రాజకీయ పరిశీలకులు 'సీరియస్'గానే చర్చించుకుంటున్నారు. సిఎం సొంతజిల్లాతోపాటు ప్రతి పక్షనాయకుడైన చంద్రబాబు జిల్లా కూడా అయిన చిత్తూరులో జగన్ 'చెక్' పెట్టడం రానున్న రాజకీయ మార్పులకు సూచనగా పరిశీలకులు భావిస్తున్నారు.

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా
ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా
"రిచార్జబుల్ టార్చ్‌లైట్" అందిస్తున్నాము.
1-12-2010 నుండి 31-3-2011 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/-

జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతోపాటు కానుక అడిగితీసుకోండి.
ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి (చెక్కులు స్వీకరించబడవు)
ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా
మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి.
కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు
వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పాగతోట,
నెల్లూరు - 524 001. ఫోన్: 0861 - 2327354.

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

పాఠకులకు



ప్రత్యేక కానుక

శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము



తూర్పు కనుపూరు గ్రామం, చిల్లకూరు మండలం,
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా.

జాతర మహోత్సవ ఆహ్వానము

తేది 29-3-2011 నుండి తేది 1-4-2011 వరకు

తేది 29-3-2011 మంగళవారం	శ్రీ పోలేరమ్మ వారి నిలుపు - జాతర ప్రారంభం.
తేది 30-3-2011 బుధవారం	యార, శ్రీ గురునాధస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం. గొల్లల వేడుకలు.
తేది 31-3-2011 గురువారం	పగలు : శ్రీ గురునాధస్వామి గ్రామోత్సవం, రాత్రి : అమ్మవారి ఉయ్యాలసేవ
తేది : 1-4-2011 శుక్రవారం	ఉదయం : పోలేరమ్మను వెళ్లనంపు ఉత్సవం.

ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడును.

వేలంపాటలు

30, 31 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి అమ్మవారికి సమర్పించిన కానుకలు బహిరంగ వేలంలో విక్రయించబడును.
తేది 1-4-2011 శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారికి కానుకగా ఇచ్చిన దున్నపోతు వేలంపాటలో విక్రయించబడును.



శ్రీ కమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఛైర్మన్
ఎ.వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణాధికారి

ధర్మకర్తల మండలి సభ్యులు

గుడి నాగరాజు, అద్దేపల్లి సుబ్రమణ్యం, సింహాద్రి మదన్‌మోహన్, చాకిరి సుబ్బయ్య, మారంశెట్టి ధనుంజయ, పర్వతాల రత్నమ్మ, ఏరూరు సుబ్రమణ్యం, పూడిపర్తి మల్లికార్జున్‌రెడ్డి.

● దేవాలయాల్లో

బ్రహ్మోత్సవాల సందడి!

జిల్లాలో బ్రహ్మోత్సవాల సందడి నెలకొనింది. దక్షిణ భారతంలో మరో శ్రీరంగంగా ప్రసిద్ధిగాంచిన తల్పగిరి రంగనాధస్వామి, కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసి వున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, గూడూరు అలఘునాధస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు జరగడంతో జిల్లా అంతటా భక్తుల్లో కోలాహలం నెలకొని వుంది. దేవేరులతో కలసి స్వామి వార్ల దర్శనం, విద్యుత్ దీపాల ధగధగలు, పోటెత్తిన భక్త జనంతో ఆలయాలన్నీ కిటకిటలాడుతున్నాయి.

సింహపురి క్షేత్ర పాలకుడు శ్రీ రంగనాధస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మార్చి 14వ తేదీ నాడు అంకురార్పణతో ప్రారంభమైన ఈ వేడుకలు తెప్పోత్సవంతో ముగిశాయి. 15తేదీ తిరుమంజనం, ధ్వజారోహణం, శేషవాహనం, పూలంగి సేవ 10న వసంతోత్సవం, 17న గరుడసేవ, 18న చందనాలంకారం, 21న రథోత్సవం సందర్భంగా ఉభయ నాంచార సమేతుడై శ్రీ రంగనాధుడు వివిధ అలంకారాలతో సింహపురి ప్రజలకు దర్శనమిచ్చాడు. ఎంతో పేరు గడించిన ఈ రంగడి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడం విశేషం.

బిలకూట క్షేత్రంలో కొలువై వుండే శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు మార్చి 14తేదీన ప్రారంభం కావడంతో ఆ ప్రాంతమంతా భక్తులతో, వెంకటేశ్వరుడి నామస్మరణతో మారుమ్రోగింది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధిగాంచిన ప్రసన్నుడిని దర్శించి మొక్కులు తీర్చుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీవారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాల సమర్పణతో సాంప్రదాయ బద్ధంగా వెంకటేశ్వరుని కళ్యాణం కమనీయంగా జరగడం విశేషం. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకొనే భక్తులు, వరపడేవారు, సామూహిక పొంగళ్లు పెట్టుకొనే వారితో బిలకూట క్షేత్రం జనసంద్రంగా మారింది.

గూడూరులో ప్రసిద్ధిగాంచిన అలఘునాధస్వామి బ్రహ్మోత్సవాలు సైతం ఇదే సమయంలో జరగడం విశేషం. వివిధ పుష్పాలతో అలంకార శోభితుడైన అలఘునాధుడు పట్టణ ప్రజలకు దర్శనమిచ్చాడు. ప్రసిద్ధిగాంచిన మూడు ప్రాంతాలలో బ్రహ్మోత్సవాలు జరగడంతో జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని వుంది.




దేవేరులతో కొలువు దీరిన రంగడు.



కొండ బిట్రగుంటలో ప్రసన్నుడికి కళ్యాణోత్సవం.

ట్రంకురోడ్డు

రంగ... రంగా!



నెల్లూరీయుల ఆరాధ్య దైవం తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గతవారం మొదలయ్యాయి. ఇవి 25తేది వరకు జరుగుతాయి. రంగడికి జరిగే సేవల్లో ముఖ్యమైన హనుమంత, బంగారు గరుడ సేవ, అశ్వవాహనాలన్నీ మోత కూలీల సేవలోనే సాగుతాయి. రథోత్సవం, తెప్పోత్సవం మాత్రం భక్తుల సేవతో సాగుతాయి. విచిత్ర మేమిటంటే ఈ యేడాది రంగడి ఉత్సవాలకు మోత కూలీలు దొరకలేదు. దీంతో ఆలయ పాలక వర్గం ట్రాక్టర్లు సిద్ధం చేస్తే భక్తమండలి ఊరుకోలేదు. ఛైర్మన్ పత్తిబాబు కూలీలకు ఎంత కూలీలైనా ఇస్తానని వారిని తీసుకోరమ్మని భక్తమండలిని కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. మోత కూలీలు లేరని భక్తులు ఓ రోజు రంగడి ఉత్సవాన్ని రెండు గంటలపాటు కదలనీయ లేదు. తన కొచ్చిన కష్టాలను మన ఇష్ట దైవం ఎవరికి చెప్పుకోవాలి?

వివేకా 'లీక్స్'



నెల్లూరు నేతలు చేసే రాజకీయమే వేరు. పార్టీ సమావేశాలు, ప్రెస్‌మీట్స్, బహిరంగ సభల్లో ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకొంటారు. పెళ్లిళ్లు, పబ్బాలకు కలుసుకొన్నప్పుడు బాగా మాట్లాడుకొంటారు. ఫోన్లలోనూ రోజువారీ సంగతులపై చర్చించుకొనే నేతలు నెల్లూరులో వున్నారు. గత పక్షం రోజులుగా జిల్లా కలెక్టర్ రాంగోపాల్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల మధ్య ప్రకటనల యుద్ధం జరుగుతుంది. కలెక్టర్ తాను తిట్టింది చాలదన్నట్లు రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలతో సోమిరెడ్డిని తిట్టించడంతో కలెక్టర్ చేసిన నిర్వాకాలన్నీ బయటపెట్టేశాడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. కలెక్టర్ గారి వద్ద ఈ ప్రశ్నలకు సమాధానాలు లేవు. విచిత్రమేమిటంటే కలెక్టర్ తీసుకొన్న పలు పొరపాటు నిర్ణయాలపై సోమిరెడ్డికి అధికారిక సమాచారాన్ని రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి 'వికీలీక్స్' మాదిరి లీక్ చేశారట. బాగుంది కదూ ఈ రాజకీయం!

నీతికి నిలబడ్డ అయ్యోర్లు!



ఈ మధ్య కాలంలో గురువులు తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. దీనికి కారణం వారు కాస్త దారి తప్పడమే. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయులు, పట్టభద్రుల నియోజకవర్గం నుంచి సిపిఎం అనుబంధిత ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ బలపరచిన వీరపు బాలసుబ్రహ్మణ్యం, యండ్లపల్లి శ్రీనివాసులురెడ్డి గెలిచారు. ఈ స్థానాల నుంచి పోటీ చేసిన మిగతా అభ్యర్థులు బాగా డబ్బు ఖర్చు పెట్టారు. ప్రలోభాలకు గురి చేశారు. కుల, వర్గ ప్రస్తావనలు తెచ్చారు. కాని నియమబద్ధ ప్రచారం, కేవలం ఓటు అభ్యర్థన కరపత్రాల ఖర్చుతో వీరపు, యండ్లపల్లి గెలిచారంటే దీనికి కారణం నీతికి నిల బడ్డ అయ్యోర్లని చెప్పొచ్చు. గురుబ్రహ్మలు బాగుంటే సమాజం బాగుంటుంది. ఇది పాత మాటే.





కీళ్ళ నొప్పులు, వాత సంబంధిత రోగాలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో సంప్రదింపులు ఫలిస్తాయి. ఆర్థిక విషయాలు తృప్తిక రంగా వుంటాయి. అరువు పుచ్చుకొన్నవారు తిరిగి చెల్లిస్తారు. కోరిన తావున రుణాలందుతాయి. వ్యాపారులు భాగస్వాముల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వృత్తిపరులు చక్కని ఆదాయాన్ని చూస్తారు. ఉద్యోగులకు పదోన్నతి, లేనివారికి నూతన ఉద్యోగ ప్రాప్తి లభిస్తుంది.



ఆరోగ్య విషయం చాలా చక్కగా వుంటుంది. ఊపిరితిత్తులకు సంబం ధించి కొద్దిగా సమస్యలుండవచ్చు. ఖర్చులు అదుపులో వుండి ఆదాయం బాగుంటుంది. పాత వస్తువులను అమ్మ జూస్తారు. భాగ స్వామి ద్వారా మేలు కలుగుతుంది. వ్యాపారవృద్ధికి ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగులకు ఎదురుచూసిన ఆదాయం ఉంటుంది. వృత్తి పరులకు దూర దృష్టిలోపం ఇబ్బందులను కలుగజేస్తుంది.



శరీరంలో జీవశక్తి తగ్గుతుంది. ఆకస్మిక ప్రమాదాలు ఎదురవవచ్చు. కుటుంబం పెద్దలతో అవగాహనాలోపం గొడవలకు దారి తీస్తుంది. దైవం వైపు మనసు పోనివ్వడం మంచిది. ఆదాయంలో మిశ్రమ ఫలితాలుంటాయి. స్పెక్యులేషన్ జోలికి పోరాదు. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. పాత బాకీలు వసూలు కావడం కష్టం. ఉద్యోగులకు కాలం సుకరంగా ఉండదు.



ముందుచూపుతో అడుగేయాలి. ప్రతి విషయంలో ఎదుటివారు తప్పుగా అంచనా వేస్తారు. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. నరాలకు సంబంధించిన బాధలధికం. సంతానమూలంగా మానసిక వేదనకు గురౌతారు. ప్రయాణాలు కోరినరీతిలో జరుగవు. వ్యాపా రులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది. ఎవరికి ఎలాంటి మాట ఇవ్వవద్దు.



గొంతు, ఊపిరితిత్తులు, కన్ను వీటికి సంబంధించిన చిన్న చిన్న అనారోగ్య బాధలు తప్ప వేరే తీవ్ర అనారోగ్యసమస్యలుండవు. కళత్ర సంబంధాలు చక్కగా ఉంటాయి. పిల్లల ఆకస్మిక అనారోగ్యం ఆవేదనకు గురిచేస్తుంది. విరోధులు అణగి ఉంటారు. పితృవర్గం మరియు సోదరుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. నూతన ఆదాయ మార్గాలు కనుచూపుమేరలో లేవు.



దీర్ఘరోగులకు ఊరట. ఆరోగ్య సమస్యలు తక్కువ. కుటుంబ సభ్యుల మధ్య సహకారం బాగుంటుంది. దాంపత్య సుఖం చక్కగా వుంటుంది. పాత పెట్టుబడుల నుండి మంచి లాభాలందుతాయి. అప్పులు తీరు స్తారు. భాగస్వామి నుండి మంచి తోడ్పాటుంటుంది. వ్యాపారవృద్ధికి ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగులకు చాలా మంచి కాలం. విద్యా ర్థులు తృప్తికరమైన ఫలితాలను పొందుతారు.

వారఫలాలు

తేది 26-3-2011 నుండి 1-4-2011 వరకు మీనంలో రవి, బుధ, కుజ, గురువులు; కుంభంలో శుక్రుడు; ధనుస్సులో రాహువు; కన్యలో శని; మిథునంలో కేతువు; ధనుర్మకర, కుంభాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభ ముహూర్తాలు లేవు.

మార్చి తిథులు


ఫాల్గుణ బహుళ

26	శని	అష్టమి	తె.5.50	గం.ల.వ
27	ఆది	నవమి	పూర్తిగా	
28	సోమ	నవమి	ఉ.6.48	గం.ల.వ
29	మంగళ	దశమి	ఉ.8.22	గం.ల.వ
30	బుధ	ఏకాదశి	ఉ.10.22	గం.ల.వ
31	గురు	ద్వాదశి	మ.12.39	గం.ల.వ

ఏప్రిల్ తిథులు

1	శుక్ర	త్రయోదశి	మ.3.05	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తీవ్రమైన అనారోగ్య సమస్యలు లేకపోయినా గ్యాస్ట్రిక్ సమస్యలు, నరాలకు సంబంధించిన సమస్యలుంటాయి. కళత్ర సంబంధాలు చక్కగా ఉంటాయి. ఇంటిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పుణ్య క్షేత్రాటనం చేసే అవకాశముంది. ఆర్థికంగా చాలా చక్కని కాలం. స్పెక్యులేషన్ లాభిస్తుంది. కొనుగోలుదారుల నాడిని సరిగా తెలుసుకొని వ్యాపారులు మంచి లాభాలను ఆర్జిస్తారు.




సుఖసంతోషాలకు కొదువ ఉండదు. ఆస్తి సమకూర్చుకొనే ప్రయ త్నాలు చేస్తారు. పలుకుబడి పెరుగుతుంది. ఎదురుచూసిన తావులో ధనప్రాప్తి. వృత్తిలో అమోఘం. కళాకారులకు మేలు. శుభ కార్యాచరణ. సత్సంగమం. దూరాలోచనతో స్థిరధనాదాయాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ముఖ్య నిర్ణయాలు తీసుకొంటారు. బంధుమిత్రులు సహాయ సహకారాలు అందిస్తారు.



ఆరోగ్యం చక్కగా ఉంటుంది. కొందరికి గుండెకు సంబంధించిన సమస్యలుండవచ్చు. దీర్ఘకాలికరోగులు జాగ్రత్త. సోదరుల ప్రవర్తన ఇబ్బందికరంగా ఉండవచ్చు. పిల్లల చదువు విషయం తృప్తికరంగా వుండదు. కుటుంబ సభ్యులలో ఒకరు మీతో విరోధం పాటించ వచ్చు. ఆర్థిక విషయాలు చాలా తృప్తికరంగా ఉంటాయి. కొత్త పెట్టు బడులు మంచి ప్రయోజనాన్నిస్తాయి. వృత్తిపరులకు పోటీలెక్కువ.



వీరికి ఈ కాలం చాలా ఇబ్బందికరమైనది. నిద్రలేమి, జ్వరం, పాదా లకు గాయాలు బాధిస్తాయి. కుటుంబంలో కూడా చిన్న చిన్న సమ స్యలుంటాయి. కళత్ర సంబంధాలు చక్కగా వుండవు. ఆర్థిక విష యాల్లో అడ్డంకులెక్కువ. ఎదురుచూసిన డబ్బు చేతికందదు. ఖర్చు లధికము. వసూళ్లు తక్కువ అవడం, ఋణదాతల ఒత్తిడి వ్యాపారు లను బాధిస్తాయి. వృత్తిపరులకు అన్ని వైపుల పోటీలధికం.



ఆరోగ్య సమస్యలు తీవ్రతరంగా ఉంటాయి. వివిధ రకాలైన అనా రోగ్య బాధలుంటాయి. భార్యా, భర్తల నడుమ అభిప్రాయ బేధాలు అధికం. బంధువులతో సమస్యలు తీవ్రమౌతాయి. ఆర్థిక విషయాలు కొంత మెరుగు. అప్పులు పుడతాయి. భాగస్వామి ప్రవర్తన ఇబ్బంది కరంగా ఉంటుంది. వృత్తిపరులు విస్తరణ చేస్తారు. ఉద్యోగులకు రావలసినవి అందుతాయి. విద్యార్థులకు కోరిన ఫలితాలు దక్కవు.



ఆకస్మికంగా పైత్య, బిపి బాధలెదురౌతాయి. దగ్గు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలుండవచ్చు. బంధుమిత్రుల సమాగమం ఆనందాన్నిస్తుంది. కొత్త బాంధవ్యాలేర్పడవచ్చు. ఆర్థిక విషయాలలో నూతన ప్రయత్నాలు చేస్తారు. ఖర్చులధికంగా ఉంటాయి. వృత్తిప రులు అధికంగా శ్రమించాలి. ఉద్యోగులకు మేలైన కాలం. ఎదురు చూసినవి లభిస్తాయి. గృహిణులు మానసిక శ్రమకు గురౌతారు.

తులసికోట పవిత్రతపై అశ్రద్ధ దోష యుక్తం!

పుణిదెల బాలామణి ఆత్మకూరు

** తులసికోట విధివిధానాల గురించి చెప్పండి?*

తులసి పవిత్రత, సంరక్షణ, పెంపకం, విధి విధానాలను క్రమశిక్షణతో పాటించాలి. తూతూ మంత్రంగా నీళ్లు చల్లడం, ప్రదక్షిణలు చేయడం, అశ్రద్ధ దోషయుక్తం!

డాక్టర్ జయంత్ ఒంగోలు

** మా యింటి స్థలం దక్షిణం, పశ్చిమం నైరుతి ఎత్తుగా వుంది?*

వశిష్ఠ వాస్తులో ఈ స్థలాన్ని గజపృష్ఠ భూమి అంటారు. ఇలా వుంటే ఐశ్వర్యం, ఆయుర్వృద్ధి కలుగుతాయి.

డాక్టర్ పి.ఎన్.ముకుంద సికింద్రాబాద్

** జ్యోతిషం విజ్ఞాన శాస్త్రమా?*

20 శతాబ్దం ప్రారంభంలోనే కొందరు అజ్ఞా నులు సుప్రీంకోర్టులో ఈ అంశంపై 'పిల్' వేశారు. సుప్రీంకోర్టు ఆ పిల్‌ను కొట్టివేస్తూ 2004లో జ్యోతి షం విజ్ఞాన శాస్త్రంగానూ, భారతీయుల భావాలకు గౌరవం చేకూర్చేదిగానూ భావించింది. ఇటీవలే ముంబై హైకోర్టు సుప్రీంకోర్టు తీర్పును సమర్థిం చింది.

పరిటాకుల సుశీల తడ

** యంత్ర ప్రతిష్ఠ, వినాయక స్థాపన విష యాలు కరెక్టుగా చెప్పండి?*

యంత్రం 'ఓంకార రూపం' అంచేత దేవుడి గదిలో సాత్విక బలితో ప్రతిష్ఠించాలి. వినాయక విగ్రహస్థాపన తర్వాత నిత్యదీపం, ప్రతిదినం పూజ చేయాలి.

పమిడి సదాలక్ష్మి కావలి

** రత్నధారణ తర్వాత పాప ఆరోగ్యం, యంత్ర ప్రతిష్ఠ తర్వాత ఆయనకు పోయిన ఉద్యో గం వచ్చి కుటుంబం బాగు పడింది.*

మీ నమ్మకం, నిష్ఠ, భక్తి మీకు శుభాన్ని చ్చాయి. శాస్త్రాన్ని నమ్మారు. కష్టాలు గట్టెక్కారు. భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పండి.

జంపన అనూషరెడ్డి కర్నూలు

** పాప పరీక్షలప్పుడు పూజచేసి రుద్రాక్ష తీసుక వెళుతుంది. పరీక్ష బాగా రాస్తుంది. కానీ కష్టానికి తగిన మార్కులు రావడం లేదు.*

పూజ వల్ల కేంద్రీకృత బలం, రుద్రాక్ష వల్ల నమ్మకం కలుగుతాయి. మంచిదే. అయితే ఒకసారి సైకియాట్రిస్ట్ దగ్గర కౌన్సిలింగ్ ఇప్పించండి.

ఆర్.ధనుంజయ బెంగుళూరు

** తూర్పు, ఉత్తరాల్లో వృక్షాలున్నప్పుడు ఏం చేయాలి?*

వృక్షాలు ఫలించి మరణించాక మాత్రమే తీసివేయాలి. లేని పక్షంలో 'వృక్షవేధ' మూడు మాసాల నుంచి మూడు సంవత్సరాల వరకూ వేధిస్తుంది. ఈ లోగా 'నరఘోష' యంత్ర ప్రతిష్ఠ దుష్ఫలితాలను తొలగిస్తుంది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

టి.సత్యంరామచంద్రరావు సికింద్రాబాద్

** ఊళ్లు తిరగడం, ఇళ్లు మారడం, వ్యాపా రాలు మార్చడం తప్ప బాగు పడింది లేదు.*

గృహానికి యంత్రం, వ్యక్తికి రత్నధారణ, దోష నివారణకు 'రుద్రాక్ష' పూజ, నవగ్రహ ప్రదక్షిణం ఇవన్నీ మార్గాలు. నమ్మి ఇవన్నీ చేసి చూడండి. ఆ పైన కృతజ్ఞతలు చెబుతారు.

పి.జయశంకర్ బాపట్ల

** మాది తూర్పు ఇల్లు అయినా చాలా సమ స్యలున్నాయి.*

గృహ నిర్మాణం పట్ల నిర్లక్ష్యం ఈ సమస్యలకు కారణం. రోడ్డు, స్థలము, గృహమూ ఈ మూడు కోణాల్ని సరిదిద్దుకోకుండా నిర్మాణం చేయడం వల్ల ఏ దిక్కు గృహమైనా ఉత్పాతాలకు కారణమవు తుంది.

పిసనాక రఘురామిరెడ్డి కడప

** దేవాలయం చుట్టుప్రక్కల గృహాలు వుండవచ్చా?*

ఆలయం, మసీదు, సమాధులు, దర్గాలు వున్న ప్పుడు చుట్టుప్రక్కల స్థలాలు, గృహాలు 'దూషిత ప్రభావానికి' గురౌతాయి. అనారోగ్యం, ఆర్థిక దుష్ప భావాలు, మానసిక ఒత్తిడులున్నప్పుడు 'నరఘోష' యంత్రం ప్రతిష్ఠించుకోవాలి!

పి.శాంతారెడ్డి సంగం

** వాస్తు, జ్యోతిష శాస్త్రాల ప్రకారం గృహాలు నిర్మించుకుంటే లాభమేమిటి?*

అగస్త్య వాస్తు ప్రకారం గృహంలో సుఖం, ధనం, ఆరోగ్యం, సద్బుద్ధి సంతానం, సకల మనో రదసిద్ధి, స్వర్గసుఖ సంప్రాప్తి ఉంటాయి.

నెల్లూరు - ముత్తుకూరు రోడ్డుకు రాజకీయ గ్రహణం!

నెల్లూరు నుంచి ముత్తుకూరుకు నిర్మింప తలపెట్టిన నాలుగులైన్ల రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిల మధ్య వున్న రాజకీయ విభేదాలు అడ్డంకిగా మారాయి.

ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య ఏర్పడిన రాజకీయ విభేదాల నేపథ్యంలో నెల్లూరు – ముత్తుకూరు మధ్య నిర్మింప తలపెట్టిన నాలుగు లైన్ల రోడ్డుకు గ్రహణం పట్టింది. ప్రస్తుతం రెండు లైన్లుగా వున్న రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సర్వే కూడా పూర్తయింది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులు నేటికీ ఖర్చుకు నోచుకోకుండా పోయాయి. ప్రజాప్రతినిధుల మధ్య తలెత్తిన విభేదాలతో మధ్యలో అధికారులు, ప్రజలు ఇబ్బంది పడక తప్పడం లేదు.

వివరాల్లోకి వెళ్తే... పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరుకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సంవత్సరం క్రితం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నెల్లూరు నగరంలోని రామలింగాపురం కూడలి నుంచి ముత్తుకూరు వరకు నాలుగు లైన్ల రోడ్డు వేయాల్సి వుంది. రోడ్డు విస్తరణ చేపట్టే ప్రాంతాలకు ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిల మధ్య గతంలో రాజకీయ విభేదాలు వుండేవి. ఈ క్రమంలో రూరల్ నియోజకవర్గం పరిధి రూరల్ మండలంలోని కాకుపల్లి వరకు వుంది. అక్కడ నుంచి సర్వేపల్లి నియోజకవర్గం కలుస్తుంది.

నెల్లూరు నుంచి కాకుపల్లి వరకు రోడ్డు విస్తరణ, నిర్మాణం కోసం 20 కోట్ల రూపాయలు కేటాయించారు. విస్తరణలో భాగంగా కొన్ని భవనాలు తొలగించాల్సి రావడంతో రాజకీయ జోక్యం ఏర్పడింది. ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతాయన్న భయంతో రోడ్లు, భవనాల శాఖ అధికారులు వెనుకంజ వేశారు. నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి సుముఖంగా వున్నా రూరల్ ఎమ్మెల్యే నుంచి సహకారం అందకపోవడంతో అధికారులు ఏమీ చేయలేక పోతున్నారు. నగరం నుంచి తొలుత నిర్మాణ పనులు ప్రారంభిస్తే తప్ప మిగిలిన ప్రాంతంలో పనులు చేపట్టే అవకాశం లేదు.

నెల్లూరు నుంచి ముత్తుకూరు వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆశించిన ఈ ప్రాంత ప్రజలకు నిరాశే మిగిలింది. సంవత్సరం క్రితం కేటాయించిన 20 కోట్ల రూపాయలు ఖర్చు చేయలేక పోతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆనం వర్గంతో దోస్తీ కట్టిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి రోడ్డు విస్తరణ కోసం చర్చలు కూడా జరిపిన దాఖలాల్లేవు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వుండే రోడ్డు నిర్మాణానికి కృషి చేయాల్సింది పోయి విభేదాలను దృష్టిలో వుంచుకోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ముత్తుకూరు మండలంలో వివిధ పరిశ్రమలు ఏర్పాటవుతుండడంతో వాహనాల రద్దీ అధికంగా వుంది. వాహనాల రద్దీని దృష్టిలో వుంచుకొని నాలుగు లైన్ల రోడ్డును నిర్మించేందుకు ఇద్దరు ఎమ్మెల్యేల



దెబ్బతినిపోయిన ముత్తుకూరు రోడ్డు.

తోపాటు ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది. ఈ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంవత్సరం తర్వాత చింతారెడ్డిపాళెం దగ్గర జాతీయ రహదారి నుంచి నగరంలోని చిన్నపిల్లల పార్కు వరకు కొత్తగా చేపట్టిన నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ కోసం పక్కా భవనాలను సైతం కూలగొట్టి పనులు చేయిస్తున్నారు. ముత్తుకూరుకు వెళ్లే నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం కృషి చేయక పోవడం బాధాకరం.

ఉపాధి హామీ

ఉపాధి హామీ పథకంలో స్వల్ప మార్పులు!

గత ఐదేళ్లుగా కొనసాగుతున్న ఉపాధి హామీ పథకంలో కొన్ని మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూలీలకు నేరుగా నగదు అందించకుండా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని, ఈ పనిని మండల అభివృద్ధి కార్యాలయం చేపట్టాలని తన వుత్తర్వుల్లో పేర్కొంది.

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఇక నుంచి పాత పద్ధతినే కొనసాగించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ప్రారంభించి దాదాపు ఐదు సంవత్సరాలు గడిచింది. గ్రామీణ ప్రాంత ప్రజల వలసలు నివారించి ఏడాదికి 100 రోజులు పని కల్పించాలన్న సంకల్పంతో కేంద్రం ఉపాధిహామీ పథకాన్ని రూపొందించింది. 75శాతం కేంద్రం, 25శాతం రాష్ట్రప్రభుత్వం నిధులు భరిస్తూ వస్తున్నాయి. పథకం ప్రారంభించిన తొలిరోజుల్లో పెద్దగా స్పందన రాలేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే పనులు కల్పించడంతో ప్రతి ఒక్కరూ పనికి వెళ్లేవారు.

కూలీల నమోదు, జాబ్‌కార్డులను స్థానిక పంచాయితీ కార్యదర్శులు జారీ చేసేవారు. అయితే ఇక్కడ కూడా పలు అవకతవకలు చోటు చేసుకోవడంతో మార్గదర్శకాలు మార్చింది ప్రభుత్వం. మండల స్థాయిలో ఎంపిడిఓలు, ఎపిఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పర్యవేక్షణ చేయాలని నూతన మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా ఎన్ని కఠిన నిబంధనలు రూపొందించినా ఏదో ఒక రూపంలో అధికారులు రాజకీయ నేతల ప్రలోభాలకు గురై పథకానికి తూట్లు పొడుస్తున్నారు. పథకం ప్రారంభించిన ఐదు సంవత్సరాలలో పలు దఫాలు నిబంధనలు మారాయి. అయినా కూడా ఉపాధిహామీలో నిధుల దుర్వినియోగం జరుగుతూనే వుంది.

సామాజిక తనిఖీల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ జరిగినా, ఇందుకు బాధ్యులుగా గుర్తించిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు రికవరీ చేయలేకపోయారు. రాజకీయఒత్తిళ్ల కారణంగా అధికారులు వెనుకంజ వేశారు. ఉపాధిహామీ పథకం అమలు తీరుపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు వెళ్లడంతో మార్గదర్శకాలపై గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు పరిశీలించి గతంలో రూపొందించిన మార్గదర్శకాలనే అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయిలోనే అవకతవకలు జరగకుండా నియంత్రిం చేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

కూలీలకు నేరుగా నగదు అందించకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా ఈ దఫా నిర్ణయించారు. కూలీలందరికి బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం కొంత కష్టతరమైనప్పటికీ అక్రమాలు జరగకుండా వుండేందుకు ఖాతా ప్రారంభించేందుకు సంబంధితశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఏడాదికి వంద రోజులు పని దినాలు కల్పించేవారు. ప్రస్తుతం 125 రోజులు పని కల్పిస్తారు. వరి కోతలు ముగిసిన వెంటనే రెండవ పంట వేయని ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభిస్తారు. వ్యవసాయ పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉపాధిహామీ పనులు చేపట్టాల్సి వుంటుంది.

ఇక నుంచి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నుంచి కూలీ నగదు బ్యాంకులకు జమ చేసే అవకాశం వుంది. గ్రామస్థాయిలో పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌ల జోక్యం కూడా తగ్గనుంది. ఉపాధి హామీలో పాత విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అక్రమాలను ఏవిధంగా నియంత్రిస్తారో వేచి చూడాలి.



పరమ చెత్త 'రాజ్'

✍ అల్లూరు రహీం

మనసంతా నువ్వే, నేనున్నాను, బాస్ చిత్రాలను తీసిన దర్శకుడు వి.ఎన్.ఆదిత్యకు కుటుంబ బంధాలను చక్కగా ఆవిష్కరించి చిత్రాలు తీస్తాడనే పేరుంది. అటువంటి ఆయన ముక్కోణపు ప్రేమ కథంటూ షకీలా మళయాళీ చిత్ర సన్నివేశాలను జొప్పించి తీసిన చిత్రమే రాజ్. ఈ చిత్రంలో సుమంత్ హీరో. అందాల భామలు ప్రియమణి, విమలారామన్ హీరోయిన్లు. ప్రియమణిది సంసార పక్షమైన పాత్రంటూ చూపుతూ విపరీత అందాల ప్రదర్శన చేయించాడు. అది చాలదన్నట్లు సుమంత్, ప్రియమణి మధ్య ముద్దుల మోత మోగించాడు. ఆమె కూడా ఇంత చీప్ గ్లామర్ ప్రదర్శనకు మరో చిత్రంలో అవకాశం రాదన్నట్లుగా రెచ్చిపోయింది. బికినీ వేసింది. చిట్టిపొట్టి దుస్తులన్నీ వేసి సంసారపక్ష ప్రేక్షకులను బాగా ఇబ్బంది పెట్టేసింది. మరో హీరోయిన్ విమలా రామన్ తాను తక్కువ తినలేదన్నట్లుగా మాద్రన్ భామనంటూ బికినీ వేసింది. బేవార్సు బాత్రూం సన్నివేశాల్లోనూ రెచ్చిపోయింది. పోటీపడి హీరో సుమంత్‌కు తెగ ముద్దు లిచ్చేసింది. పాటలు, మాటలు, సన్నివేశాలు మరీ హద్దులు దాటేసినా సెన్సార్ అధికారులు ఈ చిత్రంలో తమ కత్తెరకు పదును పెట్టే పనే మరచిపోయారు. చీప్ గ్లామర్ ప్రదర్శన వైపు మొగ్గిన దర్శకుడు చిత్రంలో కథ గూర్చి పూర్తిగా మర్చిపోయాడు. ఆయనే వ్రాసుకొన్న స్క్రీన్‌ప్లే అంతా శృంగార భరితమే. ప్రేక్షకుల బలహీనతను క్యాష్ చేసుకోను కుమార్ బ్రదర్స్ రాజ్ చిత్రాన్ని తీసినట్లున్నారు. ఈ చిత్రంలో ఐదు పాట లున్నాయి. అందంతో పందెం, కల కాదుగా, సూటిగా చూశావా పాటల్లో ప్రియమణి, అంతే నేను మరచి పోయా పాటలో విమలా రామన్, రీమిక్స్ చేసిన భీమవరం బుల్లోడా పాటలో ఇద్దరు హీరోయిన్లు రెచ్చిపో యారు. ఈ చిత్రంలో చెప్పుకోవాల్సింది కెమెరామెన్ జగన్‌ను. ఆయన గోవా, కులు మనాలీ ప్రదేశాల తోపాటు హీరోయిన్ల అందాలను తెరపై ప్రేక్షకులు దిమ్మ తిరిగిపోయేలా చూపించాడు. కోటి సంగీతం మామూలుగా వుంది. దర్శకుడే వ్రాసిన చెప్పకుండా తెలుసుకోవడమే భార్యను అర్థం చేసుకోవడం, చిన్న చిన్న విషయాల్లో ఓడిపోవడం నేర్చుకోవాలి మాటలు బాగున్నాయి.

చిత్ర సమీక్ష

చిత్రకథలోకి వెళ్తే ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్ రాజ్(సుమంత్)తో ఆయన తండ్రి(వైజాగ్ ప్రసాద్) తన మిత్రుడు (గిరిబాబు) కుమార్తె మైథిలి(ప్రియమణి)తో పెళ్లి కుదిర్చినట్లు చెబుతాడు. ఈ మాట విని రాజ్ షాక్‌కు గురవుతాడు. తాను గోవాలో ఓ మాడల్ ప్రియ(విమలా రామన్)ను ఇష్టపడ్డానని ఆమె కనపడకుండా పోయిందంటాడు. తండ్రి తీవ్ర ఆగ్రహావేశాలు ప్రదర్శించడంతో మైథిలి మెడలో తాళి కట్టేస్తాడు. తొలి రాత్రి ఆమెతో ఒకరినొకరు అర్థం చేసుకొన్నాక కాపురం చేద్దామంటాడు. అయితే ఆమె కాస్త కవ్వింపులకు దిగాక కాపురం చేసేస్తాడు. ఇంతలో రాజ్‌కు లండన్‌కు వెళ్లే ఛాన్స్ వస్తుంది. ఈ కాంట్రాక్ట్ పై ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో మాట్లాడను వెళ్లగా ప్రియ (విమలా రామన్) కనిపిస్తుంది. దీంతో అతను లండన్ వెళ్తున్నట్లు భార్యతో చెప్పి ప్రియను వెతికే పనిలో పడతాడు. మైథిలి స్నేహితురాలు తనకు రోడ్డుపై కనిపించే రాజ్ గూర్చి ఆమెకు ఫోన్ చేసి చెబుతుంది. రెండు మూడు ఘటనల తర్వాత మైథిలి రాజ్‌ను అనుమానిస్తుంది.

లండన్‌కు పోని అతన్ని నిలదీసి విడాకుల నోటీసు ఇస్తుంది. ఇంతలో ప్రియ రాజ్‌కు దగ్గరవుతుంది. గతంలో ఆమె అతడితో గోవాలో ఓ రేయి గడపటానికి, సర్వస్వం అప్పగించడానికి మైథిలితో ఆమెకు చిన్న నాటి నుంచి వున్న శత్రుత్వమే కారణమని తెలుసుకొంటాడు. చివరన ప్రియ మిత్రుడు జేమ్స్(అజయ్) మైథిలి, ప్రియలను కిడ్నాప్ చేస్తాడు. ఇక్కడ జరిగే ఫైటింగ్‌లో రాజ్‌ను జేమ్స్ పొడవబోగా ప్రియ అడ్డొచ్చి ప్రాణాలు కోల్పోతూ ఐలవ్‌యూ అంటుంది. భార్యతో రాజ్ సర్దుకున్నా వాళ్లకు కొన్నాళ్లకు పుట్టిన పాపకు ప్రియ అని పేరు పెట్టడంతో రాజ్, మైథిలిల మధ్య మళ్లీ జగడం మొదలవ్వడం, చిత్రం సమాప్తమవడం ఒకేసారి జరుగు తుంది.

ప్రియమణి, విమలారామన్‌ల మధ్య లవర్ బాయ్‌గా సుమంత్ చాల లేదు. ముద్దులు పెట్టడంలో మాత్రం రెచ్చిపోయాడాయన. దర్శకుడు వి.ఎన్.ఆదిత్య నుంచి ఇటువంటి మళయాళీ మసాల కంగాళీ చిత్రం రావడం ప్రేక్షకులు భరించలేకపోతున్నారు.

డిమాండ్ తగ్గని రాఖీ!



రోజంతా కష్టపడితే నాలుగు వందల రూపాయలు కూలీగా దక్కుతుంది. ఏదైనా సంస్థల్లో పనిచేస్తే వేలల్లో జీతాలిస్తారు. కాని బాలీవుడ్ ఐటెమ్‌గాళ్ రాఖీ సావంత్ ఒక గంట మాట్లాడితే ఏకంగా లక్షలు ధారబోస్తు న్నారు. రాఖీ డిమాండ్ తగ్గలేదన్న దానికి ఇంతకంటే వేరే ఉదాహరణ అక్కర లేదేమో? కొన్ని టీవీ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వుంటూ స్టేజి షోలు చేస్తుంది రాఖీ. ఈ మధ్యనే ఆమె ఓ మొబైల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొంది. తమ ఖాతాదారులతో ఫోన్లో లేదంటే ముఖాముఖిగా ఓ గంట మాట్లాడితే రెండు లక్షలు ఇవ్వ డానికి ఆ సంస్థ అంగీకరించింది. రాఖీతో మాటలంటే మజకానా??

ప్రేమలో అమృతా!



మహేష్‌బాబుతో కలసి అతిథి చిత్రంలో నటించిన హీరోయిన్ అమృతారావు కోరే కోరికలు తీర్చ లేక మరో తెలుగు నిర్మాత ఆమెను హీరోయిన్‌గా బుక్ చేయను సాహసించ లేదు. బాలీవుడ్‌లోనూ ఆమెకు అవకాశాలు అం తంత మాత్రంగానే వున్నాయి. మధ్యలో ఒకసారి బికినీ వేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఇక ఖాళీగా వుం డడం దేనికని వెంటనే ప్రేమలో పడిపోయింది. నీల్ కుల కర్ణి అనే డాక్టర్‌కు అమృత మనసిచ్చిందని తాజా సమాచారం. అంతకు ముందు కొంతమంది బాలీవుడ్ హీరోలతో రాసుకపూసుకొని తిరిగినా కుల కర్ణిని మాత్రం నిజంగా ప్రేమిస్తుందని అమృత సన్నిహితులు ధంకాబజాయించి చెబుతున్నారు.

కరీనాకు తిరుగులేదు!



సినీ హీరోయిన్లకు వాణిజ్య ప్రకటనలకు అవినా భావ సంబంధముంటుంది. తమ అభిమాన హీరో యిన్లు ధరించిన వస్తువులు కొనుగోలు చేయడానికి జనాలు కూడా ఎగబడతారు. అయితే అభిమానులతో పని లేకుండా అందరూ మెచ్చే ప్రకటనలు చేయడం కొందరికే సాధ్యం. అందాల హీరోయిన్ కరీనా కపూర్‌నే చూడండి. ఆమె ఏ ఒక్క ప్రకటనకో పరిమితం కాలేదు. ఏకంగా 13 సంస్థ లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ ప్రకటనల రాణి అని పించుకొంటుంది. తన జీరో సైజ్ శరీరంతో అందరినీ ఆకట్టుకొనే మహిమ కరీనా కపూ ర్‌కు వుండడంతో ప్రకటనదారులు ఆమెకోసం ఎగబడుతున్నారట.

తమిళులు మెచ్చిన హన్సిక



దేశముదురు, బిల్లా, కంత్రీ చిత్రాల్లో హీరోయిన్‌గా హన్సిక నటించినా తెలుగు ప్రేక్షకులు ఆమెనెం దుకో ఆదరించలేదు. విచిత్రంగా తమిళంలో బిజీ అయ్యింది. ఐదు చిత్రాల్లో నటిస్తుంది. నమితలా హన్సిక బొద్దుగా వుం డడంతో తమిళ ప్రేక్షకులు ఆమెను విపరీతంగా అభిమాని స్తున్నారు. ఇదే విషయాన్ని ఆమె వద్ద ప్రస్తావిస్తే సమాధా నంగా హన్సిక నేనేం లావు కాదు. సరిపడినంత వున్నాను. మరీ బక్క పల్చగా కనిపించినా బాగోదు. తమిళ ప్రేక్షకులకు నాలో ఏం నచ్చిందో నేనెలా చెప్పగలను. అయినా గ్లామర్ పాత్రలు వచ్చినంత తేలిగ్గా... అభినయ పాత్రలు రావు. అందుకే సినిమాల్లో అందాల ఆరబోత తప్పడం లేదంది.

మా మధ్య గొడవలు లేవు!



యోగా గురువు తన భర్త భరత్ ఠాగూర్‌తో నటి భూమిక విడాకులు తీసుకుంటున్నట్లు ఇటీవల వార్తలు హోరెత్తాయి. ఈ విషయమై ఆమె వద్ద ప్రస్తావిస్తే నేను ఎక్కడికెళ్లినా... సాధారణంగా భరత్ కూడా నాతో వస్తారు. ఇటీ వల ఒక కార్యక్రమానికి భరత్ లేకుండా నేనొక్కదానినే వెళ్లాను. అప్పటి నుంచి ఈ విడాకుల గోల మొదలయ్యింది. ఈ మధ్య మా అమ్మను చూడను ముంబాయి వెళ్లాను. మళ్లీ విడాకుల వార్తలు వెల్లువెత్తాయి. నేను భరత్‌పై బీహార్‌లో గృహహింస కేసు పెట్టానంటు న్నారు. తకిటతకిట సినిమా బాగా ఆడలేదని మా ఆయన్ను వదలేస్తున్నానని ఇంకొందరి గోల. అయినా సినిమా బాగా ఆడలేదని ఎవరైనా మొగుడ్ని వదిలేస్తారా చెప్పండి అని వాపోయిందామె.

పోలీసు పహారాలో పోలింగ్ ప్రశాంతం



ఎమ్మీఓ ఆఫీసు వద్ద ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు.

సన మండలి స్థానిక సంస్థల స్థానానికి 21తేదీ జరిగిన ఎన్నికలు నెల్లూరు డివిజన్‌లో ప్రశాంతంగా జరగడానికి పోలీసులు చేసిన అసాధారణ బందోబస్తు కారణమనొచ్చు. ఎన్నికలు జరిగిన ఎమ్మీఓ కార్యాలయం ప్రాంగణాన్ని పోలీసులు తమ స్వాధీనంలోనికి తీసుకొన్నారు. ప్రాంగణంలోని నెల్లూరు ఎమ్మార్వో, ట్రెజరీ, ఆర్డీఓ, మండలపరిషత్ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఎన్నికల విధుల పాస్ వుండిన సిబ్బందిని మాత్రమే ప్రాంగణంలోనికి అనుమతించారు. ఎమ్మీఓలిచ్చిన గుర్తింపు కార్డులుండిన జడ్పీటీసీలు, ఎమ్పీటీసీలను ఓటువేయను లోనికనుమతించారు. ఎఆర్ ఎఎస్పీ నాగేశ్వరరావు నెల్లూరు నగర, రూరల్ డిఎస్పీలు రాధిక, రవికుమార్‌లతోపాటు రూరల్ సిఐ జయరామ సుబ్బారెడ్డి, కృష్ణపట్నం పోర్ట్ సిఐ పోతురాజులు పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రంలో నెల్లూరు ఆర్డీఓ వెంకటరమణారెడ్డి, ఎమ్మార్వో భక్తవత్సలరెడ్డిలు పలు జాగ్రత్తలు, వీడియో పహారా నడుమ ఓటింగ్‌ను కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఎలక్షన్ ఏజంట్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఎన్నికల కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని జగన్ వర్గం ఏజంట్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి ఫోను ద్వారా బయట వుండిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సమాచారం అందించడంతో ఆయన తన అనుచరులతో పెద్ద గందరగోళం చేశారు. పోలీసులను తిట్టి పోశారు. తనకు పోలింగ్ కేంద్రంలోనికి పోయి వచ్చే అనుమతి వుండగా ఈ గందరగోళమేమిటని విజయకుమార్‌రెడ్డి మీడియా ముందు వాపోయారు. ఒక దశలో ఆయన డిఎస్పీ రాధికపై కస్సుబుస్సులాడినా ఆ తర్వాత సర్దుకొన్నారు. ఓటింగ్‌కొచ్చిన ఎమ్పీటీసీలు, జడ్పీటీసీలను నఖశిఖ పర్యంతం పరీక్షించి వారి దగ్గరుండిన ప్రతి వస్తువు తీసుకొని పోలింగ్ కేంద్రంలోనికి పంపించడంతో వారు అసహనానికి లోనయ్యారు. పోలింగ్ కేంద్రానికి కాస్త ముందు జగన్ వర్గీయులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో పెద్ద శిబిరం ఏర్పాటు చేసుకోగా, కాంగ్రెస్‌పార్టీ అభిమానులు నిలబడను షామియానా కూడా వేయలేదని కార్యకర్తలు రుసరుస లాడడం కనిపించింది. ప్రింట్ మీడియాకు పోలింగ్ కేంద్రంలోనికెళ్లే అనుమతి వున్నా అధికారులు కాస్త అతికి పోవడం విమర్శకు దారి తీసింది.

తగ్గిన వరి దిగుబడులు

వాతావరణంలో మార్పులే కారణం

జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా వరి దిగుబడి తగ్గింది. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సరైన దిగుబడి రాక పోవడంతో రైతులు కుదేలవుతున్నారు. వాతావరణంలో మార్పులు, అతివృష్టి, అనావృష్టి ఫలితంగా నారుమడులు, పంటలు దెబ్బతినడం, రెండు సార్లు నార్లు వేయాల్సి రావడం, చీడపీడల బెడద అధికం కావడంతో వరి దిగుబడులు తగ్గేందుకు కారణంగా చెప్తున్నారు. మరోవైపు క్రిమిసంహారక మందుల ధరలు, ఎరువులు, కూలీల కొరత, విపరీతంగా పెరిగిపోయింది. సోమశిల రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు వుండడం, వర్షాలు కురవడంతో జలాశయాలు, చెరువుల్లో నీరు అందుబాటులో వుండడంతో రైతులు ఎంతో ఆశగా వరి సాగుచేసినా దిగుబడులు తగ్గుముఖం పట్టడం రైతులను నిరాశ పరిచింది. ఈ సీజన్‌లో ఎనిమిది రకాల తెగుళ్లు పంటలను దెబ్బతీశాయి. పెట్టుబడి పెరిగింది. ఎరువుల ధరలు పెంచుకొనేందుకు కంపెనీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఏకంగా 20 శాతం మేర ధరలు పెంచారు. వర్షాలు అధికంగా కురవడంతో వరి దుబ్బు కట్టకపోవడం, వెన్ను సరిగా తీయకపోవడం దిగుబడులు తగ్గడానికి కారణంగా భావిస్తున్నారు రైతులు. దీనికితోడు మద్దతు ధర లభించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం మేర దిగుబడులు తగ్గినట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు త్రాగునీటి కష్టాలు!

నిరుపయోగమైన నీటి పథకాలు

వేసవి కాలం ప్రారంభం కావడంతో త్రాగునీటి సమస్య విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పరిస్థితి ఘోరంగా వుంది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారడంతో విద్యార్థులు గొంతు తడుపు కోవడానికి అల్లాడి పోతున్నారు. జిల్లావ్యాప్తంగా 1,775 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో త్రాగునీటి వసతి కోసం రెండేళ్ల క్రిందట 5.41 కోట్ల రూపాయలు నిధులతో నీటి వసతి కల్పించారు అధికారులు. ఒక్కో పాఠశాలకు 20వేల రూపాయల నుంచి 30వేల రూపాయలు కేటాయించి ఏర్పాటు చేసిన ఈ సదుపాయం విద్యార్థులకు ఉపయోగపడకుండా పోతోంది. కొన్ని ప్రాంతాలలో పైపులు మరమ్మత్తులకు గురవడంతో నీటి సరఫరా నిలిచిపోగా, మరికొన్నిచోట్ల విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో త్రాగునీటి కోసం, ఏర్పాటుచేసిన ట్యాంకులు దిష్టి బొమ్మల్లాగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన త్రాగునీటి పథకాలు విద్యార్థుల దాహం తీర్చలేక పోతుండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతుంది.



ప్రయాణీకులు వేచి చూసేందుకు తగిన సౌకర్యమేది?

ఆర్టీసి బస్టాండ్‌లో సమస్యల హాల్ట్

నెల్లూరు ఆర్టీసి మెయిన్ బస్టాండ్‌లో సమస్యలు హాల్ట్‌వేసి వున్నాయి. పేరుకు ప్రధాన బస్టాండ్ అయినప్పటికీ సౌకర్యాలు మాత్రం పూజ్యం. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, నిర్వహణాలోపం ప్రయాణీకుల పాలిట సమస్యలుగా మారాయి. ఆర్టీసి ప్రధాన బస్టాండ్‌తో పాటు ఆత్మకూరు బస్టాండ్‌లోనూ ఇదే పరిస్థితి. కనీస సౌకర్యాలకు నోచుకోక ప్రయాణీకులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిస్థితి ఘోరం. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణీకులు కూర్చునేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొళాయిల వద్ద పాచి పేరుక పోయి వున్నా పట్టించుకొనే వారే లేరు. త్రాగునీటికి ప్రయాణీకులు అవస్థలు పడాల్సి వస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. చివరకు ప్రయాణీకులు కూర్చొనే బల్లలు, కుర్చీలు దెబ్బతిని వున్నా వాటి స్థానంలో మంచి వాటిని ఏర్పాటు చేయకపోవడంతో గంటల తరబడి నిలబడాల్సి రావడంతో వృద్ధులు అసౌకర్యానికి గురౌతున్నారు. బస్టాండ్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు బస్టాండ్‌లో నీటి వ్యాపారం దగాకోరుగా సాగుతోంది. కొళాయి నీటిని పట్టి తెచ్చి మినరల్ వాటర్ పేరుతో ప్రయాణీకులను నిలువుదోపిడీ చేస్తున్నా వారిపై చర్యలు చేపట్టడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేమంటే మా దృష్టికి ఇలాంటి ఫిర్యాదులు రాలేదని వస్తే విచారించి తగు చర్యలు చేపడుతామని చెప్పి చేతులు దులుపుకొంటుండడంతో ప్రయాణీకులు అన్నివిధాల నష్టపోతున్నారు.



ఏసికి వారసుల నివాళి!

ఆనం కుటుంబీకుల రాజకీయ వైభవానికి పునాదులు వేసిన స్వర్గీయ ఏసి సుబ్బారెడ్డి 106వ జయంతిని పురస్కరించుకొని 17వ తేది ఏసి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి వారసులు నివాళులర్పించారు. ఆర్థిక మంత్రి రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి హైదరాబాదులో వుండడంతో రామనారాయణరెడ్డి కుమారుడు ఆనం శుభకర్‌రెడ్డి, వివేకానందరెడ్డి కుమారులు ఏసి సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డి ఏసి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఏసినగర్‌లోని సుబ్బారెడ్డి సమాధి వద్ద ఏసి సంపూజన సమితి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారెడ్డి హరిశ్చంద్రారెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, పత్తి రవీంద్రబాబు, చాట్ల నరసింహారావు, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేబాల గ్రామ కాపురస్తుడు యేటూరు విజయబాబు, మల్లికల ఏకైక కుమార్తె లక్ష్మీతేజ, జలదంకి హజరత్తయ్య, శైలజల కుమారుడు వెంకట హరీష్‌కుమార్‌ల వివాహం మార్చి 6వ తేది నెల్లూరు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో జరిగింది.

అమెరికానాస్పత్రి ఆస్తుల అమ్మకంపై నిషేధం

నెల్లూరులోని అమెరికన్ ఆస్పత్రి ఆస్తుల అమ్మకం, కొనుగోళ్లపై పూర్తి నిషేధం విధించింది మద్రాసు హైకోర్టు. అమెరికన్ ఆస్పత్రి ఆస్తుల మీద పలురకాల న్యాయ వివాదాలున్నాయి. మద్రాసు, హైదరాబాదు హైకోర్టులలో కేసులున్నాయి. అయితే వాటిని లెక్క చేయకుండా, ఆ ఆస్తులతో ఏ సంబంధమూ లేని అమెరికన్ బాప్టిస్ట్ ఫారెన్ మిషన్ సొసైటీ అనే సంస్థ, చాలా అమ్మకాలు జరుపుతున్నది. తాజాగా అమెరికన్ ఆస్పత్రి ఆవరణంలోని తూర్పు భాగంలో దాదాపు మూడెకరాల విస్తీర్ణాన్ని, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలనే నెపంతో విక్రయం జరిపారు. దాని కొనుగోలు చేసిన వారు, కోర్టు ఉత్తర్వులను దాచి పెట్టి, ఆ భూమిని ప్లాట్లుగా విభజించి, దాదాపు 80 మందికి అమ్మివేశారు. దీనిపై రెవరెండ్ బిఎం.సుధీర్ అనే ఖమ్మం జిల్లాకు చెందిన క్రైస్తవ భక్తుడు మద్రాసు హైకోర్టులో న్యాయధిక్కార పిటిషన్ వేశాడు.

ఆ పిటిషన్‌ను విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.మురుగేశన్, జస్టిస్ కెకె.శశిధరన్ చాలా తీవ్ర పదజాలంతో ఆస్తుల అమ్మకంపై నిషేధం విధించారు. గతంలో మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఉత్తర్వులను ఉల్లఘిస్తూ ఆస్తుల అమ్మకం జరపడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు న్యాయమూర్తులు. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆమెరికన్ ఆస్పత్రి యాజమాన్యంతో సంబంధం వున్నవారు కానీ, వారి నుంచి కొనుగోళ్లు జరిపిన వాళ్లు కూడా ఇక ముందు ఈ ఆస్తులకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరపడానికి లేదని, ఈ ఆస్తులను కొన్న వారందరూ ఈ కేసులో భాగస్వాముల క్రిందనే వస్తారని స్పష్టమైన మధ్యంతర తీర్పు ప్రకటించింది మద్రాసు హైకోర్టు.

కోర్టులలో కేసులున్నాయని తెలిసి కూడా, లెక్కలేనితనంగా, బరితెగింపుగా వ్యవహరించిన వారికి ఈ మధ్యంతర తీర్పు గట్టి గుణపాఠం కాబోతుంది. అమెరికన్ ఆస్పత్రి సేవాత్యాగాలకు ప్రతిరూపమైన ప్రజా సంస్థ. దాని మీద ఎవరికీ ఎటువంటి అధికారమూ లేదు. ఆస్పత్రి నిర్వహణ కష్టమైతే, మరొక రూపంలో ప్రజలకు ఉపయోగపడాలే తప్ప, దాన్ని తెగనమ్మి జేబు నింపుకోవాలని చూడడం క్షమించరాని నేరం. అటువంటి ఆషాడభూతులకు అండగా నిలచి, కోర్టు ఉత్తర్వులకు భయపడవద్దని భరోసా ఇచ్చి మరీ ఈ ఆస్తులు అమ్మించారు నెల్లూరుకు చెందిన కొందరు నీచ రాజకీయనాయకులు. వారి మాటలు నమ్మి, చవకగా వస్తుందనే ఆశతో ప్లాట్లు కొన్న అమాయకులు ఇప్పుడు అన్యాయమై పోతున్నారు.

జిల్లాలో ఇందరు పెద్దలుండీ నివారించలేక పోయిన దుర్మార్గాన్ని, కేవలం క్రీస్తు మీద భక్తితో ఒంటరిగా ఎదిరించి నిలిచిన ఆ భక్తుడిని మనసారా అభినందిస్తున్నాము.

జగన్‌ను అరెస్టు చేస్తారా?

మొదటి పేజీ కొరవ

సిబిఐ ద్వారా అరెస్టు చేయించాలన్నది ప్రభుత్వ సంకల్పంగా చెప్తున్నారు. అయితే ఈ రెండు వివాదాలలో జగన్‌కు ప్రత్యక్షంగా సంబంధం వుందని నిరూపించడం ఎట్లా సాధ్యం అన్నదే ప్రశ్న.

జగన్ కంపెనీలలోకి మారిషస్ వంటి దేశాల నుంచి తరలి వచ్చిన వందలాది కోట్ల రూపాయల ధన ప్రవాహంపై కేంద్ర దర్యాప్తు బృందాలు లోతుగా పరిశోధన చేస్తున్నట్లు చెప్తున్నారు. ఆ లావాదేవీలలో ఏ కొంచెం నేరసంబంధిత అంశం దొరికినా జగన్‌ను జైలుకు పంపడం క్షణాలలో జరిగిపోతుందని చెప్తున్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడాపై ప్రయోగించిన చట్టాలనే జగన్ మీద కూడా వాడుతారని వినికిడి.

జగన్‌కు కూడా ఈ విషయం అర్థమైందనే చెప్తున్నారు. దాన్ని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల మీద ఇప్పటికే ఆయన న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు చెప్తున్నారు. కోర్టుల ద్వారా తన అరెస్టును నిలుపుకోవడం కంటే, రాజకీయంగానే దాన్ని అడ్డుకోవడమే సమంజసమని జగన్ భావిస్తున్నారు. అందుకోసం ఆయన కడప ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు, ఒక్కరోజు కూడా విరామం లేకుండా ఏదో ఒక నెపం మీద జనంలో తిరగాలని ప్రణాళిక రచిస్తున్నాడు. జనం మధ్య వుంటే, తన జోలికి రావడానికి సిబిఐ సాహసించలేదని, కడప నోటిఫికేషన్ వెలువడి, నామినేషన్ వేసిన తర్వాత అసలు ఆ ప్రయత్నం చేయలేరని జగన్ భావిస్తున్నాడు.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

ప్రసాద్, పరసారత్నం 21వ తేది స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ పరిశీలనకు గూడూరు ఆర్డీఓ కార్యాలయం లోనికి ప్రవేశించబోగా డిఎస్పీ నారాయణరెడ్డి అడ్డుకొన్నారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వు మేరకు గన్‌మెన్ వున్న ప్రజాప్రతినిధులు లోనికి అనుమతించ కూడదని చెప్పగా తమకు ఆ ఉత్తర్వులు అందలేదని ఎమ్మెల్యేలు వాదనకు దిగారు. తర్వాత వాళ్లే వెనక్కు తగ్గి పాత బస్టాండ్ సెంటర్‌కు వచ్చి కూర్చొన్నారు.

రథోత్సవంలో అపశృతి

తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవంలో అపశృతి చోటు చేసుకొంది. 21వ తేది జరిగిన ఈ కార్యక్రమంలో రథం మలుపు తిరుగుతున్న సమయంలో కడప జిల్లా చెన్నూరు మండలం కొండగుంట వాసి విక్రమ్ రెడ్డి(23) చక్రాల క్రిందపడి మరణించాడు. రథం వేగాన్ని నియంత్రించలేక పోవడం, పోలీసులు తగిన బందోబస్తు చేపట్టకపోవడంతో ఈ దుర్ఘటన జరగడానికి కారణమయ్యింది. 1995లో ఇదే మాదిరిగా రథచక్రాల క్రిందపడి ఆరుగురు మరణించారు. తిరిగి 15 ఏళ్ల తర్వాత అలాంటి ఘటన జరగడంతో భక్తులు మనోవేదనకు గురయ్యారు. రథోత్సవం సందర్భంగా కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలో ఇటు పోలీసులు, అటు ఆలయ పాలకవర్గం విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తాయి

నారాయణరెడ్డి

16వ పేజీ కొరవ

విశేషం. మొత్తం 644 మంది ఓటర్లు కూడా పోలింగ్‌కు హాజరైనారు. అందులో 7 ఓట్లు చెల్లలేదు. వాకాటి నారాయణరెడ్డికి 233, రామిరెడ్డి ప్రతాప్ రెడ్డికి 221, తెలుగుదేశం అభ్యర్థి బీద రవిచంద్రకు 183 ఓట్లు వచ్చాయి. అయితే అక్కడితో కౌంటింగ్ ముగియలేదు. రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో, నారాయణరెడ్డికి 7, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి 12 ఓట్లు వచ్చాయి. వాటిని కూడా కలిపినా, 7 ఓట్ల ఆధిక్యం దక్కడంతో నారాయణరెడ్డి గెలిచినట్లు ప్రకటించారు అధికారులు.

జగన్ వర్గం అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి గెలుపుకు ఇంత దగ్గరగా రావడం విచిత్రం. మండల పరిషత్‌లు, జడ్పీటీసి ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్‌కు దాదాపు 375 మంది, తెలుగుదేశం, దాని మిత్ర పక్షాలకు ఇంచుమించు 270 మంది వున్నారు. వారిద్దరి నుంచి జగన్ వర్గం 120 మంది వరకు తనతో తీసుక వెళ్లిందని అంచనా. కాంగ్రెస్‌లో అనూహిత ఐక్యత వచ్చింది కాబట్టి, కాంగ్రెస్ అభ్యర్థి అందరి కంటే మిన్నగా డబ్బు వెదజల్లాడు కాబట్టి, కాంగ్రెస్‌కు హీన పక్షం 300 ఓట్లు వస్తాయని భావించారు అందరూ. వారి క్యాంపులలో అంత మేర ఓటర్లు కన్పించారు. ఆ లెక్క చూసినవారు, కాంగ్రెస్ సులభంగా గెలుస్తుందని, తెలుగుదేశం ద్వితీయ స్థానం సంపాదిస్తుందని, జగన్ వర్గం మూడవ స్థానంలో మిగిలిపోతుందని అంచనా వేశారు. కానీ ఫలితాలు అందుకు విరుద్దంగా వచ్చాయి. కాంగ్రెస్‌కు కేవలం 233 ఓట్లు మాత్రమే రావడం ఒక ఆశ్చర్యమైతే, జగన్ వర్గం 221 ఓట్లు సాధించడం మరింత పెద్ద విస్మయం.

రెడ్డి కులంలో ఐక్యత యాదవులలో అనాసక్తి

దీనర్థం, పార్టీ అనుబంధాలు, డబ్బు విలువ కంటే మిన్నగా ఇతర అంశాలు ఈ ఎన్నికను ప్రభావితం చేశాయని భావించాలి. అవేమిటన్నది ప్రశ్న. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందిన రెడ్డి కుల ఓటర్లు అన్ని ప్రలోభాలను, రాజకీయ అనుబంధాలను పక్కనపెట్టి, జగన్ వర్గాన్ని అక్కున చేర్చుకొన్నారన్నది ఒక అంచనా. అందువల్లనే ఆ రెండు పార్టీల నుంచి అంత విస్తారంగా ఓట్ల వలస జరిగి వుంటుందని భావిస్తున్నారు. అయితే, తెలుగుదేశం అభ్యర్థి బీదా రవిచంద్రకు ఇదే రకం కులం అనుకూలత వస్తుందని ఎన్నికలకు ముందు వేసిన అంచనాలు పూర్తిగా నిజం కాలేదు. ఆయన కులానికి చెందిన యాదవ ఓటర్లు దాదాపు 120 మంది వున్నప్పటికీ, వారిలో రెడ్ల వలె కులాభిమానం వ్యక్తం అయినట్లు కన్పించలేదు.

తెలుగుదేశానికి పక్షవాతం

తెలుగుదేశం పార్టీకి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలున్నారు. కానీ ఈ ఎన్నికలో వారు అనుకొన్న స్థాయిలో పని చేయలేకపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే, రాజకీయ పక్షవాతం సోకిన రోగివలె కన్పించింది తెలుగుదేశం పార్టీ. ఎవరిలోనూ ఆసక్తి లేదు. అసలు అభ్యర్థి బీద రవిచంద్ర కూడా అనాసక్తితో పోటీకి దిగాడు. పోటీ చేయాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోవడంలోనే చాలా ఆలస్యం చేశాడు. ఈ అస్పష్ట వాతావరణం ఆ పార్టీని దెబ్బ తీసింది. తతిమా అభ్యర్థుల వలె వారు కూడా చురుకుగా, సకాలంలో కదలి వుంటే, కాంగ్రెస్, జగన్ వర్గం ఓట్ల చీలికతో సులభంగా నెగ్గి వుండాలి. మంచి అవకాశాన్ని చేజార్చుకొన్నారు పచ్చ చొక్కాల వాళ్లు.

కాంగ్రెస్‌లో వెన్నుపోట్లు

జిల్లా కాంగ్రెస్ మొత్తం ఐక్యంగా వుందని ప్రచారం జరిగినప్పటికీ, అక్కడక్కడా కాంగ్రెస్‌లో వెన్నుపోట్లు తప్పలేదని ఫలితాలు రుజువు చేశాయి. గల్లాపెట్టె మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ నిజాన్ని అంగీకరించాడు. ఫలితాలు వచ్చిన వెంటనే ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ, ఈ ఎన్నికలో పార్టీకి ద్రోహం చేసిన వారెవరో తనకు తెలుసునని, వారి మీద కఠిన చర్య తీసుకొంటామని బెదరగొట్టాడు. ఆ తెలిసిన పేర్లు మాత్రం ఆయన పైకి చెప్పలేదు. కాంగ్రెస్ నేతలందరూ నిజంగా ఐక్యంగా పని చేసి వుంటే కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ ఇంత హీనంగా వుండేది కాదు.

నారాయణరెడ్డికి సువర్ణావకాశం

రాజకీయాలలో ఎన్ని ఓట్లతో గెలిచామన్నది లెక్క కాదు. గెలిచాడా లేదా అన్నదే ప్రశ్న. మెజార్టీ తక్కువే అయినప్పటికీ, నారాయణరెడ్డి ఈ రోజు నుంచి శాసనమండలి సభ్యుడే. జిల్లా రాజకీయాలలో, ఒక సంధి యుగంలో ఆయనకు దొరికిన సువర్ణావకాశం ఇది. గూడూరు డివిజన్ రాజకీయాలలో, నేదురుమల్లి జనార్దనరెడ్డి, రాజ్యలక్ష్మమ్మల తర్వాత ఎవరు అన్న ప్రశ్న ఒకటి వుంది. ఆ కొరతను తీర్చే అవకాశం నారాయణరెడ్డికి లభించబోతున్నది. ఒంటె గుడారంలో దూరినట్లు గూడూరు డివిజన్‌ను కబళించడానికి పనబాక లక్ష్మి ఒక పక్క, ఆనం రామనారాయణరెడ్డి మరొకప్రక్క ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారిద్దరికీ డివిజన్ కాంగ్రెస్ వాదుల నుంచి సానుకూలత రావడం లేదు. నేర్పుతో, ఓర్పుతో ప్రయత్నిస్తే, దాన్ని సాధించే అవకాశం, అదృష్టం నారాయణరెడ్డికి వున్నాయి. ఆ కృషిలో ఆయన ఎంత వరకు సఫలం అవుతాడో కాలమే నిర్ణయిస్తుంది.

జనవాణి

2వ పేజీ కొరవ

జిల్లాలో రైతులు ఈ పథకం పనుల్లో పాల్గొనడం లేదు. జిల్లా అధికారులు దీనికి కారణం వెతికి పరిష్కరించాల్సి వుంది.


పి.సత్యనారాయణ దగదర్తి

మంచివారికి టిక్కెట్లు ఇవ్వండి!

శాసనమండలికి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పరిధిలోని ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగిన పోలింగ్‌లో సమర్థులను ఓటర్లు ఎన్నుకొన్నారు. గెలుపొందిన విఠపు బాల సుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డిలలో పొరపాటున కూడా తప్పులు వెతకలేం. ఎన్నికలను రాజకీయ పార్టీలే చెడిపేశాయి. మంచి వారికి పార్టీలు టిక్కెట్లు ఇస్తే సరికొత్త రాజకీయాలు, నేతలు, ప్రభుత్వాలు ప్రజలకు అందుబాటులోనికి వస్తాయి. ఆ నవసమాజానికి రాజకీయ పార్టీలు ప్రయత్నించకపోతే అవి కాలగర్భాన కలసిపోయే రోజులు ఎంతో దూరంలో లేవు.

దోగిపర్తి సత్యం అల్లూరు

సాగునీరు కోసం ఎదురుచూపు



సోమశిల ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల ఎప్పుడో?

జిల్లాలో వరిపంట వేసున్న చివరి ఆయకట్టు రైతులు సాగునీరు కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొంత ఆలస్యంగా వరినాట్లు వేసిన రైతులు సాగునీరందక ఇక్కట్లు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. మోటార్లు, బావుల సదుపాయం వున్న ప్రాంతాల్లో ఇప్పటికే వరికోతలు కోసి ధాన్యాన్ని ఇళ్లకు చేర్చారు. ఆలస్యంగా వేసిన ప్రాంతాల రైతులు సాగునీరందించాలని కోరుతున్నారు.

కావలి, జలదంకి, అల్లూరు, బోగోలు, దగదర్తి, చిల్లకూరు తదితర మండలాల రైతులు సోమశిల రిజర్వాయర్ నుంచి విడుదలయ్యే నీటిని ఆధారం చేసుకొని వరిసాగు చేస్తారు. మార్చి నెలాఖరుకు సోమశిల రిజర్వాయర్ నుంచి పెన్నాడెల్టాకు నీటిని నిలిపి వేసే అవకాశం వుంది. ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ఆదేశాలు అందకపోయినా ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మార్చి ఆఖరున కాల్వలకు నీటిని నీటిపారుదలశాఖ అధికారులు నిలిపి వేస్తుంటారు. ఈ సంవత్సరం కూడా ఇదే పరిస్థితి తలెత్తితే చివరి ఆయకట్టు ఎండిపోయే ప్రమాదం వుంది.

కావలి కాల్వ ద్వారా జలదంకి, కావలి మండలాల్లోని వ్యవసాయ భూములకు నీటి సరఫరా చేస్తారు. అయితే ఈ కాల్వకు ఇరువైపుల కొందరు రైతులు మోటార్లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసుకొని వారి పొలాలకు నీటిని విని యోగిస్తుంటారు. ఇలా చేయడం వలన కింద ఆయకట్టుకు సకాలంలో నీరందక దిగాలు చెందుతున్నారు రైతులు. ఆయకట్టు కింద నమోదు కాని పొలాలకు ఆయిల్ ఇంజన్లు వుపయోగించి నీటిని మళ్ళించుకుంటే చర్యలు తీసుకుంటామని నీటిపారుదలశాఖ అధికారులు చేసిన హెచ్చరికలు కేవలం ప్రకటనలకే పరిమితమైపోయాయి.

వరినాట్లు వేసిన రైతులు ఎట్టి పరిస్థితుల్లో కూడా నష్టపోకుండా చూసే బాధ్యత నీటిపారుదలశాఖదే. ఇటీవల జరిగిన సాగునీటి సలహా సంఘం సమావేశంలో కూడా ఇదే తీర్మానం చేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరందకుండా పోతుందన్న సమాచారాన్ని కొందరు రైతులు అధికారులకు అందించినా ఏమాత్రం స్పందించడం లేదు. సాగునీటి సంఘాల అధ్యక్షులు సైతం అధికారులపై ఒత్తిడి తేవడంలో వైఫల్యం చెందుతున్నారు. అల్లూరు మండలంలో వెయ్యి ఎకరాలు, కావలి మండలం, జలదంకి మండలాల్లో మరో రెండువేల ఎకరాల్లో వేసిన వరిపంట చివరి దశకు చేరింది. సాగునీటిని నిలిపివేస్తారన్న వార్త రైతులకు చేరడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు బ్యాంకుల నుంచి బయట అప్పులు చేసి వరిసాగు చేసిన రైతులు నీటిని నిలిపి వేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు చివరి ఆయకట్టు రైతుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని సాగునీరందించాల్సిన అవసరం వుంది.

కవిత్వ ప్రయోగాల నెల్లూరు కవిదిగ్గజం పఠాభి!

తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి సాహిత్య సినీ రంగాలలో పఠాభిగా చిరపరిచుతుడయ్యాడు. ఆయన అసలు సిసలైన సాహిత్య సినీ రంగాల ప్రజ్ఞాపాటవాలు లోకానికి చాటి చెప్పాడు. ఆయన 92వ జన్మ సంవత్సరం సందర్భంగా పఠాభి స్మృతుల్ని ఓ మారు విశ్లేషించుకుందాం.

నెల్లూరు జిల్లాలో 1919 సంవత్సరంలో జన్మించిన పఠాభి రవీంద్ర కవీంద్రుని శాంతినికేతన్‌లోనూ, అమెరికాలోని 'కొలంబియా'లోనూ విద్యాభ్యాసం చేశారు. గణితంలో అతను అసాధారణ ప్రజ్ఞావంతుడు. అతని జ్ఞాపకశక్తికి, మేధావిత్వానికి పాశ్చాత్యులు ఆశ్చర్యపోయే వారని ఓ సందర్భంలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు నాతో అన్నారు. సాహిత్యంలో పఠాభి అనేకానేక ప్రయోగాలు చేశాడు. ఆయన 'ఫిడేలు రాగాల డజన్' శ్రీశ్రీ మహా ప్రస్థానం లాగా, ఆరుద్ర త్వమేవాహమ్‌లాగా సుప్రసిద్ధమైంది. ఇతని పన్నెండుగురు స్నేహితురాళ్ల నేపథ్యం ఫిడేలు రాగాల వెనుక వున్న అసలు కథ అని చెబుతారు అతనికి సన్నిహితులైన స్నేహితులు. పఠాభిలో ప్రజ్ఞాపాటవాలతో రసికత శృతిచేసిన రాగం లాంటిదంటారు సాహిత్య విమర్శకులు.

శ్రీశ్రీ పీఠిక!

పఠాభి శ్రీశ్రీ అభిమాని. ఫిడేలు రాగాలు కవితలు రాశాక స్వయంగా శ్రీశ్రీకి చూపించారు. శ్రీశ్రీ వినూత్న పంథాలో సాగిన ఫిడేలు రాగాలను మెచ్చుకొని దీన్ని పుస్తకంగా తెస్తే తానే పీఠిక రాస్తానని హామీయిచ్చాడట! అన్నట్టుగానే పీఠిక రాశాడు శ్రీశ్రీ.

బెజవాడ బావ!

సాహిత్యంలో సమఉజ్జీ అయిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి 'పఠాభి'కి స్వయానా బావ. 'ఫిడేలు' అచ్చువేయమని సతపోరినవాడూ బెజవాడే! అందరి వత్తిళ్లు తట్టుకోలేక పఠాభి 1939 ఆగష్టు మాసంలో 'ఫిడేలు రాగాలు' ప్రచురించాడు.

ఫిడేలు రాగాల 'కలకలం'!

తెలుగు సాహిత్య రంగంలో 'ఫిడేలు రాగాలు' తీవ్ర సంచలనాన్ని కలిగించింది. క్రీ.శ 1939 నుంచి 1945 వరకూ దానిపై తీవ్రమైన చర్చలు కొనసాగాయంటే ఆ కావ్యమెంత సంచలనాత్మకమైనదో మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత పఠాభి 'పఠాభి పంచాంగం' 'కయిత నా దయిత' కవితా సంపుటాలను ప్రచురించాడు. అయితే ఫిడేలుకు వచ్చినంత పేరు వాటికి రాలేదు. పద్యం, భావకవిత్వానికి పూర్తి వ్యతిరేకి పఠాభి. ఆయన మాత్రాఛందస్సును బాగా ఉపయోగించుకున్నాడు. పఠాభి తిరుగుబాటు మాటల తూటాల్ని చూడండి.

పాయసం సుబ్రహ్మణ్య మహర్షి

"నా వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో

పద్యాల నడుముల్ విరగదంతాను

చిన్నయ సూరి వ్యాకరణాన్ని చాల దండిస్తాను"

ఇట్లా కొనసాగుతుంది ఆయన కవిత్వం. అప్పట్లో పద్య కవిత్వం పట్ల వ్యతిరేకత వున్న వాళ్లంతా అతనితో కలసి నడిచారు.

స్నేహలతారెడ్డితో సాన్నిహిత్యం!

తీవ్రవాద భావాలున్న పఠాభికి సినీ నటి స్నేహలతారెడ్డితో పరిచయమై అది ప్రణయంగా మారింది. ఆమెను పఠాభి తన అర్థాంగిగా స్వీకరించాడు. వీరి వివాహం ఇరు కుటుంబాల వారికీ అస్సలు ఇష్టం లేదు. ఈ ప్రేమ వివాహమే అతడిని కన్నడిగురాలైన ఆమె భాష వైపు మొగ్గుచూపేలా చేసింది.

"స్వర్ణ కమల" పురస్కారం!

ఈ నేపథ్యంలో పఠాభి సినీ నిర్మాత, దర్శకుడుగా మారిపోయాడు. కవితారాగాలకు పుల్‌స్టాప్ పెట్టి కన్నడ, తెలుగు చిత్రాలవైపు దృష్టి సారించాడు. కన్నడంలో అతను తీసిన 'సంస్కార' కన్నడ చిత్రం స్వర్ణకమలాన్ని సాధించింది. ఒక విధంగా చెప్పాలంటే స్నేహలతారెడ్డికి, కన్నడిగులకు స్వర్ణ కమలాన్ని అందించి వారికి మరింత చేరువయ్యాడు పఠాభి!

తెలుగు వైపు చూపు సారింపు!


ఒక వైపు కన్నడ సీమల్లో వుంటూనే తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రవేశించి పెళ్లినాటి ప్రమాణాలు, శ్రీకృష్ణార్జున యుద్ధం, భాగ్యచక్రం వంటి సినిమాలు తీశాడు పఠాభి!

ఉద్యమ రథసారథులు!

స్నేహలతారెడ్డితో కలసి పఠాభి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ఎమర్జెన్సీలో స్నేహలతారెడ్డిని అరెస్టు చేశారు. ఆమె అప్పట్లో 'బ్రాంకైటిస్ ఇస్నోఫిలిస్' అనే శ్వాసకోశ వ్యాధితో బాధపడేది. ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరి బిక్కిరై తల్లడిల్లుతుంటే జైలు అధికారులు మానవీయంగా కూడా వ్యవహరించలేదు. అదొక నరకం అంటారావిడ. జైలు సిబ్బంది క్రూరత్వాన్ని ఆమె తన స్నేహితులకు రాసిన ఉత్తరాల్లో వివరించారు.

'చండమారుత' ఉప్పెన!

ఎమర్జెన్సీ దురాగతాల నేపథ్యంలో పఠాభి 'చండ మారుత' కన్నడ చిత్రాన్ని తీశారు. ఎమర్జెన్సీ క్రూర ఘటనలు ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపబడ్డాయి. ఈ చిత్రం విడుదలయ్యాక అనేక ఉద్యమాలు నడిచాయి. ఉద్యమం ఊపుకు ప్రభుత్వాలు కూడా కొట్టుకపోయాయి.



పఠాభి పోగొట్టుకున్నదే ఎక్కువ!

కవిగా, నిర్మాతగా, దర్శకుడుగా ఎనలేని పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్న పఠాభి నిజ జీవితంలో సంపాదించిన దానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువ. పఠాభి, స్నేహలతారెడ్డి దంపతులకు ఇద్దరు పిల్లలు కోణార్కరెడ్డి, వందనారెడ్డి.

నిష్క్రమణం!

నెల్లూరులో పుట్టి రాష్ట్రానికే పేరు ప్రఖ్యాతులు తెచ్చిన పఠాభి తన 87వ ఏట జీవిత చరమాంకం నుంచి నిష్క్రమించారు. పఠాభి మరణంతో 'ఫిడేలు రాగాలు' మూగపోయాయని అతని మిత్రులంటారు.

నేనలా అనుకోవడం లేదు–

"ఫిడేలు రాగాలు సజీవ స్రవంతులై, భావ, రాగ, లయాత్మకాలైన గీతాలై ప్రపంచమంతటా మారు మ్రోగుతున్నాయని నాకనిపిస్తుంది."

ఎందుకంటే –

పఠాభిలోని వాడి, వేడి, అలజడి, పొగరు, వగరు అందులో కూడా వున్నాయి గనుక! పఠాభి గురించి తెలిసినవాళ్లు కూడా నాలాగే భావిస్తుంటారు!

(పఠాభి 92వ జన్మ సంవత్సరం సందర్భంగా)

నారాయణరెడ్డి కాబట్టి గెలిచాడు!

- రెడ్డి కులస్తులంతా జగన్‌ను అక్కున చేర్చుకొన్నారు.
- యాదవులలో మాత్రం ఆ కులాభిమానం కన్పించలేదు.
- కాంగ్రెస్‌లో వెన్నుపోట్లు ఎవరివి?
- తెలుగుదేశానికి పక్షవాతం.



ఎమ్మెల్సీగా గెలుపొందిన వాకాటి నారాయణరెడ్డిని భుజాలకెత్తుకొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు.

శాసన మండలి స్థానిక సంస్థల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి అతి కష్టం మీద విజయం సాధించాడు. నరాలు తెగే వుద్విగ్నతలో జరిగిన కౌంటింగ్ ప్రక్రియలో, పలుమార్లు క్రిందపడి మీదకెక్కి ఆశానిరాశల మధ్య వూగిసలాడి, చిట్టచివరకు ఏడు ఓట్ల వ్యత్యాసంతో, జగన్ వర్గం అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కంటే ఏడు ఓట్ల ఆధిక్యం సాధించి, ఎమ్మెల్సీ అయ్యాడు నారాయణరెడ్డి.

ఈ ఎన్నికకు, ఈ పదవికి అన్ని విధాల అర్హుడు నారాయణరెడ్డి. ఒక్క మాటలో చెప్పాలంటే, నారాయణరెడ్డి కాబట్టి ఈ ఎన్నికలో నెగ్గి, కాంగ్రెస్ పరువు నిలిచింది తప్ప వేరెవ్వరైనా ఫలితం తారుమారుగా వుండేదనడం నిజం.

నారాయణరెడ్డి గత ఇరవయ్యేళ్లుగా సూళ్లూరుపేట నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు మహారాజ పోషక పాత్ర పోషిస్తున్నాడు. ఎస్సీ రిజర్వ్ అయిన ఆ స్థానంలో తనకు పదవీ యోగం వుండదన్న నిజం తెలిసి కూడా ఏ ఎన్నిక జరిగినా, ఏ కార్యక్రమం నిర్వహించవలసి వచ్చినా ఆ బాధ్యత తన భుజాల మీద వేసుకోవడం నారాయణరెడ్డికి అలవాటు. కొన్ని కోట్ల రూపాయలు రాజకీయాలకు తగలేసి వుంటాడు ఈ రెండు దశాబ్దాల్లో. దీనికి ప్రతిఫలంగా ఆయనకు లభించిన ఏకైక రాజకీయ ప్రయోజనం, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అధ్యక్ష పదవి మాత్రమే. అయితే నారాయణరెడ్డి ఆ పదవికి ఎంతో రాణింపు తెచ్చాడు. నష్టాలలో కూరుకపోయి వుండిన బ్యాంకును, అయిదేళ్లలో లాభాల బాట పట్టించాడు. నీతిగా, నిజాయితీగా పాలన సాగించి అందరి అభిమానం పొందాడు.

జిల్లా రాజకీయాలలో ఆయన నేదురుమల్లి జనార్దనరెడ్డికి అనుబంధితుడు. అయితే, అటు ఆనం, ఇటు ఆదాల వర్గాలతోనూ సఖ్యతగా, స్నేహంగా మెలగుతూ, సర్కస్‌లో త్రాడు మీద నడిచే గారడీ విద్య ప్రదర్శించేవాడు. ఆ త్రిపాత్రాభినయమే ఇప్పుడు నారాయణరెడ్డికి కలిసి వచ్చింది. జిల్లా రాజకీయాలను శాసించే మూడు వర్గాలూ ఆయన గెలుపు కోసం కష్టపడ్డాయి.

అయితే ఇక ముందు కూడా ముగ్గురితో సఖ్యతగా మెలగడం నారాయణరెడ్డికి కత్తిమీద సాము క్రిందే లెక్క. ఏ పక్క కొంత మొగ్గు చూపించినా, తతిమా ఇద్దరిలో అలుక సహజం. దాన్నెట్లా నెగ్గుకొని వస్తాడో వేచి చూడాలి.

జిల్లా రాజకీయాలలో ఎన్నో విశేషాలు, వింతలు, విచిత్రాలు కల బోసుకొన్న ఎన్నిక ఇది. దేశంలోనే కాదు, మొత్తం ప్రపంచంలోనే ఓటు విలువ ఇంతగా పెరిగిన ఎన్నిక వేరొకటి వుండదు. ఏదో వీధి కొల్లబోతే పంచలెగ్గట్టుకొని పరుగెత్తినట్లుంది, ఎన్నిక జరిగినన్ని రోజులూ రాజకీయ వాతావరణం. గ్రామ, మండల, జిల్లాస్థాయి నేతలు ఒక పక్క, ఓటర్లు మరొకపక్క అభ్యర్థులను రాబందుల వలె పీక్కొని తిన్నారు. లక్ష రూపాయల కరెన్సీ కట్టకు చిత్తు కాగితాల విలువ కూడా మిగలలేదు. ఇద్దరు ప్రధాన అభ్యర్థులకు కనీసం చెరి పది కోట్ల రూపాయలు ఖర్చు అయి వుంటాయని అంచనా. వారికొచ్చిన ఓట్ల సంఖ్యతో పోలిస్తే ఒక్కొక్క ఓటు విలువ నాలుగు లక్షల రూపాయలు పైబడుతున్నది. అమెరికన్ అధ్యక్ష పదవిలో కూడా ఓటుకు ఇంత విలువ ఏర్పడదన్నది నిజం.

నూటికి నూరు శాతం పోలింగ్ జరగడం ఈ ఎన్నికలో ఒక గొప్ప

కొరవ 14వ పేజీలో



చతుర్థ వర్థంతి

స్నేహశీలి, సౌమ్యశీలి, సహనశీలి
అజాత శత్రువుగా, ఆదర్శప్రాయునిగా, కార్యదక్షునిగా
ఎందరినో ప్రభావితం చేసిన మార్గదర్శి, కృషీవలుడు
మా ఉన్నతికి బంగారు బాట వేసిన ఇలవేల్పు

శ్రీ చిట్టమూరు విజయకుమార్‌రెడ్డి గారి

ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

చిట్టమూరు వాసుదేవరెడ్డి
చిట్టమూరు మహతి
చిట్టమూరు మహర్షిరెడ్డి
రాజవోలు గ్రామం, ఎ.ఎస్.పేట మండలం, నెల్లూరుజిల్లా.

కీ॥శే॥ చిట్టమూరు విజయకుమార్‌రెడ్డి గారు
చీఫ్ ఇంజనీరు, తెలుగుగంగ ప్రాజెక్ట్, శ్రీకాళహస్తి
జననం: 06-12-1951 మరణం: 11.03.2007

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.